

# ఇదినిజం

RNI Regd.No: APTEL/2012/45871

WWW.IDHINIJAM.COM

సాయంకాలం దినపత్రిక

పొట్టిశ్రీరాములు నెల్లూరు సంపుటి : 19 సంచిక: 356 ఎడిటర్: మాదాల వెంకటశేషగిరి గురువారం 03 సెప్టెంబర్ 2026 పేజీలు : 08 వెల: 02






# ఉత్తరాంధ్రకు జలసిరులు

**గోదారమ్మ రాకతో మురిసిన మన్యం**

- అనకాపల్లికి గోదావరి జలాలు
- పోలవరం ఎడమ కాలువకు నీటిని విడుదల చేసిన చంద్రబాబు
- పాయక రావుపేట వద్ద ముఖ్యమంత్రి జలహారతి

ఉత్తరాంధ్రలోని సాగు, తాగునీటి అవసరాలకు కీలకమైన పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు గోదావరి జలాలు చేరనున్నాయి. పాయకరావుపేట వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం పోలవరం ఎడమ కాలువ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన గోదారమ్మకు జల హారతి ఇచ్చారు. దీంతో అనకాపల్లి జిల్లాకు గోదావరి జలాల తరలింపునకు మార్గం సుగమమైంది. కాగా, ప్రస్తుతం ఎడమ ప్రధాన కాలువ ద్వారా విడిచి పెడుతున్న నీటి ద్వారా మొత్తం నాలుగు జిల్లాల పరిధిలోని 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. దీని వల్ల 5.23 లక్షల మంది దాహార్తి కూడా తీరనుంది. ఎడమ కాలువ నిర్మాణం కోసం ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం రూ.4,192 కోట్లు ఖర్చు చేసింది. ఇది ఇలా ఉంటే పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను కరవు, నీటి ఎద్దడి ఎదుర్కొనే ప్రాంతాలకు తరలించాలన్న లక్ష్యంలో భాగంగా ఎడమ కాలువకు ప్రాధాన్యం ఉంది. కాలువ ద్వారా నీరు అందుబాటులోకి రావడంతో అనకాపల్లి పరిధిలోని పలు ప్రాంతాల్లో సాగు, తాగునీటి అవసరాలకు ప్రయోజనం చేకూరనుంది.

అనకాపల్లి జిల్లా, (ఇదినిజం ప్రతినిధి ): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం అనకాపల్లి జిల్లాలోని పాయకరావుపేటలో పర్యటించారు. ఏరియల్ వ్యూ ద్వారా పోలవరం ఎడమ కాల్వను పరిశీలించి ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను విడుదల చేసి జలహారతి ఇచ్చారు. ముఖ్యమంత్రికి సంప్రదాయ కోలాటంతో స్వాగతం పలికారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు నీరు ఇస్తున్నందుకు సూచికగా పాయకరావుపేట వద్ద శిలాఫలకాన్ని సీఎం ఆవిష్కరించారు. కూటమి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి శిలాఫలకం వద్ద సీఎం చంద్రబాబు ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎడమ కాలువ నుంచి అనకాపల్లి జిల్లా వరకూ వచ్చిన గోదావరి జలాలకు ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు చేశారు. పాయకరావుపేట వద్ద పోలవరం ఎడమ కాలువ క్రాస్ రెగ్యులేటర్ నుంచి గోదావరి జలాలను ఉత్తరాంధ్ర జిల్లాలకు విడుదల చేశారు. ఎడమ కాల్వ ద్వారా వదిలే నీటితో నాలుగు జిల్లాల పరిధిలో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు ఇచ్చేలా ఏపీ ప్రభుత్వం ప్రణాళిక రచించింది. ఎడమ కాలువ నిర్మాణానికి రూ.4,192 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసింది. ఎడమ కాలువ ద్వారా వచ్చిన నీటితో అనకాపల్లి వద్ద ఏలేరు కాలువతో పాటు జిల్లాలోని 110 చెరువులను నింపేలా జల వనరుల శాఖ ప్రణాళిక రచించింది. గోదావరి జలాలతో పుష్కర ఆయకట్టు పరిధిలో 1.48 లక్షల ఎకరాలు, ఏలేరు కింద 80 వేల ఎకరాలు, పంపా కింద 12 వేల ఎకరాలు, తాండవ, వరహా, మామిడి గడ్డ ఆయకట్టు పరిధిలోని 46,620 ఎకరాలను ప్రభుత్వం స్థిరీకరణ చేస్తోంది.

## గొల్లగుప్పలో పలువురికి అస్వస్థత..

### మందులు ల్యాబ్‌కు పంపాలని పవన్ ఆదేశం



అమరావతి(ఇదినిజం ప్రతినిధి ): పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగుప్పలోని గ్రామస్తు లందరికీ తక్షణం వైద్య పరీక్షలు నిర్వహిం చాలని అధికారులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. గ్రామస్తులకు పంపిణీ చేసిన మలేరియా మందుల (క్లోరోక్వీన్ )ను ల్యాబ్‌కు పంపాలని సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్‌కు ఆయన ఫోన్ చేసి.. బాలిక (7) మృతి ఘటనపై ఆరా తీశారు. అలాగే ఈ ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రెండో తరగతి చదువుతున్న బాలిక మృతిపై ఆయన విచారం వ్యక్తం చేశారు. బాలిక కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామంలో ప్రత్యేక వైద్య బృందంతో పర్యవేక్షణ కొనసాగుతోందని డిప్యూటీ సీఎంకు జిల్లా కలెక్టర్ వివరించారు. మలేరియా నివారణ కోసం మాత్రలు తీసుకున్న 53 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనలో పలువురు అనారోగ్యం బారిన పడ్డారు. దీంతో తెలంగాణలోని భద్రాచలంతోపాటు లక్ష్మీపురంలో వారంతా చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. అలాగే ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని అదేశించిన సంగతి తెలిసిందే. గొల్లగుప్పలో 74 మందికి మలేరియా నివారణ కోసం క్లోరోక్విన్ ట్యాబ్లెట్లు పంపిణీ చేశారు. వీటి వల్ల పలువురు అస్వస్థతకు గురయ్యారు. ఈ ట్యాబ్లెట్ వికటించి.. విద్యార్థి జమున (7) మృతి చెందిన సంగతి తెలిసిందే.

## స్థానిక ఎన్నికల్లో ఉనికి కోసం గొడ్డలి పార్టీ ఆరాట పడుతోంది: మంత్రి జనార్దన్ రెడ్డి



కర్నూలు, (ఇదినిజం ప్రతినిధి ):: వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉనికి కోసం గొడ్డలి పార్టీ ఆరాట పడుతోందని విమర్శించారు. వైసీపీ ఏ రోజు ప్రజల సమస్యలపై ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు. బుధవారం కర్నూలు జిల్లాల్లో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు ముందస్తు ఆలోచనతో ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా చూస్తున్నారని పేర్కొన్నారు.

**చంద్రబాబు దూరదృష్టితో పట్టిసీమను పూర్తి చేసి ఆదుకున్నారు..**

జగన్ హయాంలోని ఐదేళ్లలో ప్రజా సంక్షేమం కోసం ఏమి చేశారో చెప్పే దమ్ము ఉందా అని బీసీ జనార్దన్ రెడ్డి నిలదీశారు. సీఎం చంద్రబాబు దూరదృష్టితో పట్టిసీమను పూర్తి చేసి ఆదుకున్నారని తెలిపారు. పులివెందులకు కూడా నీరు ఇచ్చిన ఘనత చంద్రబాబుదని చెప్పుకొచ్చారు. 36 నీటి ప్రాధాన్య ప్రాజెక్టులకు నీరు ఇస్తున్నామని వెల్లడించారు. ఏపీలో డ్రిప్ ఇరిగేషన్ లేకుండా చేసింది జగన్ మోహన్ రెడ్డినే అని విమర్శించారు.

**వైసీపీ దొంగ దీక్షలు, ధర్నాలు చేస్తే ప్రజలు నమ్మరు..**

వైసీపీ నేతలు దొంగ దీక్షలు, ధర్నాలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని మంత్రి అన్నారు. ప్రజలకు, రైతులకు ఏ విధంగా నీరు ఇవ్వాలో అధికారులతో తాము సమీక్షలు చేస్తున్నామని తెలిపారు. తలకిందులు చేసిన కూడా గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదన్నారు. కేసీ కెనాల్‌కు నీరు ఎప్పుడు విడుదల చేస్తామో త్వరలోనే వెల్లడిస్తామని చెప్పారు. వైసీపీ లాగా సెట్టింగ్‌లు వేసి తాము డ్రామాలు చేయమని బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు.

## అయోధ్య రామాలయ ట్రస్ట్ సీఈఓగా ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా



అయోధ్య, (ఇదినిజం ప్రతినిధి ):అయోధ్య రామాలయ ట్రస్ట్ సీఈఓగా ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా ఎంపికయ్యారు. ఈ మేరకు జన్మభూమి ట్రస్ట్ కమిటీ నిర్ణయం తీసుకుంది. 5,585 దరఖాస్తులను పరిశీలించిన కమిటీ.. 39 ఏళ్లపాటు ఎయిర్‌ఫోర్స్‌లో సేవలందించిన జితేంద్ర మిశ్రాను ఆలయ ట్రస్ట్ సీఈఓగా నియమిస్తున్నట్లు ప్రకటించింది. భారత వైమానిక దళానికి సంబంధించిన ఎన్నో ఆపరేషన్లలో కీలకంగా పని చేసిన మిశ్రా.. గతేడాది జరిగిన ఆపరేషన్ సిందూర్ సమయంలో వెస్ట్రన్ కమాండర్‌గా సేవలందించారు. 2026 ఏప్రిల్లో ఆయన ఎయిర్‌ఫోర్స్ కమాండర్‌గా రిటైరైయ్యారు. ఆపరేషన్ సిందూర్‌లో తన కృషికి గుర్తింపుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సర్వోత్తమ యుద్ధ సేవ మెడల్‌ను కూడా అందుకున్నారు.

**ట్రస్ట్‌లో ముగ్గురు కొత్త సభ్యులు..**

రామాలయ ట్రస్ట్‌లో ముగ్గురు కొత్త సభ్యులను కూడా కమిటీ నియమించింది. మదన్ మోహన్ పాండే, మహేశ్ భగచంద్కా, నిర్మలా యాదవ్‌లను సభ్యులుగా ఎంపిక చేసింది. కొన్ని నెలల క్రితం అయోధ్య రామాలయ విరాళాల్లో దుర్వినియోగం జరిగిన విషయం తెలిసిందే. అందుకే ట్రస్ట్ ప్రక్షాళన దిశగా ఈ మేరకు మార్పులు అనివార్యమయ్యాయి. రాములోరి నిధులు కాజేసిన కేసులో ఎనిమిది మంది ఇప్పటికే అరెస్టయ్యారు. దీంతో అప్పటి జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ వ్యవహారంతో ఒక్కసారిగా దేశంలో దుమారం రేగిన సంగతి తెలిసిందే.

RNI Regd.No: APTEL/2012/45871
ఈదినిజం
సాయంకాలం దినపత్రిక

# సంపాదకీయం

గురువారం 03 సెప్టెంబర్ 2026

## జెన్‌జీని మోదీ జయించగలరా?

'నిలదొక్కుకోవాలంటే తడబడడం అవసరం' అని ఒక కవి అన్నారు. ప్రస్తుతం మోదీ ప్రభుత్వం అదే దారిలో ఉన్నట్లు కనిపిస్తోంది. జూలై 20--25 తేదీల మధ్య దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లను బుట్టదాఖలు చేయాలని, తదుపరి దర్యాప్తులు చేయరాదని ఉన్నత న్యాయస్థానం ఆదేశించడంతో... దేశ రాజధానిలో కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో సెప్టెంబర్ 5న పెల్లుబుకాల్సిన మరో అల్లకల్లోలం సమసిపోయినట్లేనని భావించవచ్చు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో జరగాల్సిన బ్రిక్స్ సమ్మిట్ నేపథ్యంలో మరోసారి శాంతిభద్రతల సమస్య తలెత్తవచ్చునని కేంద్రం భావించినందువల్లే సామరస్య వైఖరిని అవలంబించక తప్పలేదని స్పష్టమవుతోంది. ఎఫ్‌ఐఆర్‌లను రద్దు చేస్తామని, నీట్ పేపర్ లీక్‌లతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లిస్తామని సీజేపీ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకుని నెల రోజులు దాటింది. అయితే కేంద్రం ఎంతకూ ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో ఉపాధ్యాయుల దినోత్సవం రోజున ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీసు హెడ్ క్వార్టర్స్ దాకా నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని సీజేపీ ప్రకటించింది. దీంతో న్యూఢిల్లీలో పోలీసులు భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 163 కింద అనుమతిలేని అన్ని సమావేశాలను పూర్తిగా నిషేధించారు. ఈ నిరసన ప్రదర్శనపై నిషేధం విధించాలని ఒక రిటైర్డ్ పోలీసు అధికారి ద్వారా సుప్రీంకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేయించారు. సాధారణంగా అయితే పెద్ద ఎత్తున బలగాలను తరలించి, న్యూఢిల్లీని యుద్ధ క్షేత్రంగా మార్చి, ఇంటర్నెట్ సదుపాయాలను నిలిపివేసి, విద్యార్థుల ప్రదర్శనను తొక్కివేయగల శక్తి మోదీ సర్కార్‌కు ఉన్నది. విద్యార్థులతో ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత కూడా వారిని డిజిటల్ ఆధారాలతో గుర్తించి వేధించడం కేంద్రం సహజ వైఖరికి నిదర్శనం. ఆ సమయంలో పెల్లెట్ల ప్రయోగం, ఇతర దారుణాలపై అనేక సంస్థలు కోర్టుకు వెళ్లడంతో ఉన్నత స్థాయి కమిషన్‌ను నియమించాల్సి వచ్చింది. అయినప్పటికీ విద్యార్థులు ప్రభుత్వ నిజాయితీని శంకించవలసిన పరిస్థితులు తలెత్తాయి. అయితే ఒక అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సు సమయంలో పోలీసులు స్వైర విహారం, హింసాకాండ మూలంగా విదేశీ ప్రతినిధులకు అసౌకర్యం కలిగించడమే కాక, అంతర్జాతీయ ప్రతిష్ఠ దెబ్బతింటుందన్న ఆందోళనతో ప్రభుత్వం పట్టువిడుపుల ధోరణిని ప్రదర్శించక తప్పలేదు. నిరసన ప్రదర్శనను తాము నిషేధించే ప్రసక్తి లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన మర్నాడే విద్యార్థులపై ఎఫ్‌ఐఆర్‌లను రద్దు చేయాలని కేంద్రం, ఢిల్లీ పోలీసులు దరఖాస్తులు పెట్టుకున్నారు. విద్యార్థులపై కేసులు ఉపసంహరించుకుంటామని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలలలోగా నష్టపరిహారం చెల్లిస్తామని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు విన్నవించుకున్నారు. దీంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన అసాధారణ ప్రత్యేకాధికారాలను ఉపయోగించుకుని విద్యార్థులపై ఎఫ్‌ఐఆర్‌లను ఉపసంహరించాలని సుప్రీంకోర్టు ఆదేశించడం, తాము నిరసన ప్రదర్శనను ఉపసంహరించుకుంటున్నామని సీజేపీ ప్రతినిధులు ప్రకటించడంతో పరిస్థితులు సద్దుమణిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ పరిణామాలతో జూన్--జూలై నెలల్లో జరిగిన విద్యార్థుల నిరసన ప్రదర్శనల ప్రకంపనలు దేశంలో ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని అర్థమవుతోంది. ఢిల్లీలో జరిపిన నిరసన ప్రదర్శనలతో ఆగకుండా సీజేపీ దేశంలోని అనేక రాష్ట్రాల్లో ప్రజా సమస్యలపై ఆందోళనలకు ఉపక్రమించింది. ప్రభుత్వ విధానాల సమీక్ష, స్కూళ్లలో మౌలిక సదుపాయాల పరిస్థితులు, ప్రశ్నపత్రాల లీక్ సమస్యలు, పరీక్షల నిర్వహణలో లోపాలు, టీచర్ల పోస్టుల ఖాళీలు, నిరుద్యోగం, పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం వంటి సమస్యలపై మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక, ఢిల్లీలలో ఆందోళనలు నిర్వహించారు. ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న స్కూళ్లకు వెళ్లి 'స్కూల్ ఠీక్ కరో' ఉద్యమాన్ని ప్రారంభించారు. జాతీయ వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేసి 'క్యాబోల్తీ హై పబ్లిక్' పేరుతో దేశవ్యాప్త పర్యటనలు ప్రారంభించడంతో సీజేపీకి ఏదో బృహత్తర లక్ష్యం ఉన్నట్లు భావించక తప్పడం లేదు. సీజేపీ లక్ష్యం ఏదైనా, దాని భవిష్యత్తు ఎలా ఉన్నప్పటికీ, తీవ్ర ఒత్తిడి వస్తే తప్ప తన వైఖరి మార్చుకునే ధోరణి కేంద్రంలో కనపడకపోవడం సాధారణంగా మారింది. విద్యార్థుల ఆందోళన తారస్థాయికి చేరుకున్న తర్వాతే విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించారు. ఇప్పుడు ఇండియాగేట్ నుంచి ర్యాలీ చేస్తామని హెచ్చరించిన తర్వాతగానీ విద్యార్థులపై ఎఫ్‌ఐఆర్‌లను ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వం దిగిరాలేదు. ఎందుకు ప్రతి సమస్యనూ తెగేదాకా లాగి ఆ తర్వాత వెనక్కి తగ్గడం? ప్రతిసారీ ప్రభుత్వ పరువును కాపాడేందుకు సర్వోన్నత న్యాయస్థానం ముందుకురాలేదు కదా! దాని పరిమితులు దానికి ఉన్నాయి. ఎందుకో సమస్యలను పరిష్కరించడంలో, లేదా అంచనా వేయడంలో మోదీ ప్రభుత్వం విఫలమవుతోందనే అనుమానాలు కలుగుతున్నాయి. సమస్యలను పరిష్కరించేందుకు ఒక మేధో యంత్రాంగాన్ని రూపొందించుకోలేకపోవడం, కేవలం బల ప్రయోగాన్నే నమ్ముకోవడమే ఇందుకు కారణం కావచ్చున్న అభిప్రాయం కలుగుతోంది. పన్నెండు సంవత్సరాల పరిపాలన తర్వాత దేశంలో చెప్పుకోదగ్గ స్థాయిలో, అది కూడా విద్యార్థుల నుంచి మోదీ సర్కార్ ఎందుకు ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తోంది? కొత్త తరం ఇప్పుడు ప్రతి నిర్ణయాన్నీ ప్రశ్నిస్తోంది. వ్యవస్థల్లో లోపాల్ని ఎత్తిచూపుతోంది. వారికి మద్దతుగా కాంగ్రెస్‌తో పాటు ఇతరేతర శక్తులు కూడా తోడవుతున్నాయి. అంతమయ్యాయనుకున్న రకరకాల వామపక్షాలు కూడా ఇప్పుడు అత్యుత్సాహంతో తమ వంతు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయి. సోషల్ మీడియా ఉపయోగంలో ఈ అన్ని శక్తులూ కలిసికట్టుగా విజృంభిస్తున్నాయి. ఎస్‌ఎఫ్‌ఐ వంటి విద్యార్థి సంఘాల నేతలే కాదు, బిహార్‌లో తన ఉనికి కోసం పోరాడుతున్న సీపీఐ ఎంఎల్ (లిబరేషన్) వంటి పార్టీ కూడా తమ విద్యార్థి సంఘం నాయకురాలు నేహా బోరా ద్వారా జరుగుతున్న పరిణామాలను, బీజేపీని ఎండగట్టేందుకు ఉపయోగించుకుంటున్న దంటే అన్ని వామపక్ష శక్తులూ ఎలా సంఘటితమవుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితులను రాజకీయంగా ఉపయోగించుకునేందుకు ఈ శక్తులు ప్రయత్నించడంలో ఆశ్చర్యమేమీ లేదు. అవి విజయం సాధించగలవా అన్నది చెప్పలేము కానీ కమలనాథులు మాత్రం ఆత్మరక్షణలో పడ్డారనడంలో సందేహం లేదు.

# రోహిణి కమిషన్: ఆరేళ్ల విచారణ... మూడేళ్లుగా మౌనం!

**ఓబీసీల్లో అత్యంత వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ ప్రయోజనాలు అందడం లేదంటే... కేంద్రం ఇంకా ఎందుకు మౌనం వహిస్తోంది?**

భారతదేశంలో రిజర్వేషన్లు కేవలం శాతాల లెక్క కాదు. చారిత్రకంగా విద్య, ఉద్యోగాలు, సామాజిక అవకాశాలకు దూరమైన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం వాటి ప్రధాన ఉద్దేశం. అయితే, రిజర్వేషన్ ప్రయోజనాలు రిజర్వేషన్ పొందుతున్న అన్ని వర్గాలకు సమానంగా చేరుతున్నాయా అన్న ప్రశ్న ఇప్పుడు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ప్రశ్నకు సమాధానం వెతికేందుకే కేంద్ర ప్రభుత్వం 2017 అక్టోబర్ 2న రాజ్యాంగంలోని ఆర్టికల్ 340 కింద రోహిణి కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి. రోహిణి అధ్యక్షతన ఏర్పడిన ఈ కమిషన్, ఇతర వెనుకబడిన తరగతులు --- ఓబీసీల --- రిజర్వేషన్‌లో ఉపవర్గీకరణను పరిశీలించింది. అసలు ప్రశ్న సూటిగా ఉంది: ఓబీసీలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, కేంద్ర విద్యాసంస్థల్లో లభిస్తున్న 27 శాతం రిజర్వేషన్ ప్రయోజనాలు అన్ని వర్గాలకు సమానంగా అందుతున్నాయా? లేక కొన్ని బలమైన, రాజకీయంగా ప్రభావవంతమైన వర్గాలకే అధిక ప్రయోజనం దక్కుతోందా?

### రిజర్వేషన్‌లోనే అసమానత?

మండల్ కమిషన్ సిఫారసుల అమలు, 1992లో సుప్రీంకోర్టు ఇంద్రా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పు నేపథ్యంలో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ అమల్లోకి వచ్చింది. కానీ ఓబీసీలు ఒకే సామాజిక వర్గం కాదు. వేలాది కులాలు, ఉపకులాలు ఇందులో ఉన్నాయి. వాటి విద్యా స్థాయి, ఆర్థిక పరిస్థితి, సామాజిక వెనుకబాటుతనం, రాజకీయ ప్రాతినిధ్యం, ప్రభుత్వ ఉద్యోగాల్లో వాటా ఒకేలా లేవు. కొన్ని వర్గాలు రిజర్వేషన్ ప్రయోజనాలను పదేపదే పొందుతుంటే, మరికొన్ని వర్గాలకు తక్కువ లేదా అసలు ప్రాతినిధ్యం లేకపోతే, ఆ వ్యవస్థను నిజమైన సామాజిక న్యాయంగా ఎలా పరిగణించాలి? ఇదే రోహిణి కమిషన్ ముందున్న ప్రధాన ప్రశ్న. కమిషన్ లక్ష్యం మొత్తం 27 శాతం కోటాను పెంచడం లేదా తగ్గించడం కాదు. ఆ కోటాను ఓబీసీల్లోని వివిధ ఉపవర్గాలకు మరింత సమానంగా పంపిణీ చేయాలా అన్నదే దాని పరిశీలన. అంటే ఇది రిజర్వేషన్‌కు వ్యతిరేకమైన ఆలోచన కాదు. రిజర్వేషన్ ప్రయోజనాలు నిజంగా అత్యంత వెనుకబడిన వర్గాలకు చేరుతున్నాయా? అన్నదే అసలు పరీక్ష.

### కొద్దిమందికే ఎక్కువ ప్రయోజనమా?

కేంద్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు, విశ్వవిద్యాలయాలు తదితర సంస్థల్లో ఓబీసీ వర్గాల ప్రాతినిధ్యాన్ని కమిషన్ పరిశీలించింది. కమిషన్ అధ్యయనంలో రిజర్వేషన్ ప్రయోజనాల పంపిణీలో గణనీయమైన అసమానతలు ఉన్నట్లు వెల్లడైనట్లు నివేదికలు సూచించాయి. కొద్దిమంది ఓబీసీ వర్గాలు అధిక ప్రయోజనం పొందగా, పెద్ద సంఖ్యలోని ఇతర వర్గాలకు తక్కువ లేదా దాదాపు ఎలాంటి ప్రాతినిధ్యం లభించలేదనే అంశం చర్చకు వచ్చింది. ఇది నిజమైతే, ప్రశ్న రిజర్వేషన్ అవసరమా కాదా అనేది కాదు. రిజర్వేషన్ ప్రయోజనాలు ఎవరికి అందుతున్నాయి? అన్నదే అసలు ప్రశ్న.

### గణాంకాల గందరగోళం

అయితే ఇక్కడ ఒక తీవ్రమైన సమస్య ఉంది --- నమ్మదగిన కులాల వారీ గణాంకాల కొరత. భారతదేశంలో చివరిసారిగా సమగ్ర కుల గణన 1931లో జరిగింది. 2011 సామాజిక–ఆర్థిక, కుల గణనలో కుల సమాచారాన్ని సేకరించినప్పటికీ, ఓబీసీలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని విధాన రూపకల్పనకు అనువుగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. అందువల్ల ఒక ముఖ్యమైన ప్రశ్న తలెత్తుతుంది: వ్యక్తిగత ఓబీసీ వర్గాల జనాభా, విద్య, ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం ఎంత అనేది స్పష్టంగా తెలియకుండా రిజర్వేషన్‌ను ఎలా న్యాయంగా పునర్విభజించాలి? అదే సమయంలో మరో ప్రశ్న కూడా ఉంది: పూర్తి స్థాయి గణాంకాలు లేవనే కారణంతో, ఇప్పటికే కనిపిస్తున్న అసమానతలను సరిచేయడానికి చర్యలను నిరవధికంగా వాయిదా వేయాలా? డేటా విధాన నిర్ణయాలను మెరుగుపరచాలి. విధాన నిర్ణయాలను స్తంభింపజేయకూడదు.

### 14 సార్లు గడువు పొడిగింపు

రోహిణి కమిషన్ ప్రయాణమే ఈ అంశం ఎంత క్లిష్టమైనదో తెలియజేస్తుంది. మొదట స్వల్ప వ్యవధిలో నివేదిక ఇవ్వాల్సిన కమిషన్ గడువు పదేపదే పొడిగించబడింది. మొత్తం 14 సార్లు గడువు పొడిగించినట్లు సమాచారం. చివరకు దాదాపు ఆరేళ్ల అనంతరం, 2023 జూలై 31న జస్టిస్ రోహిణి తన నివేదికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించారు. కానీ నివేదిక సమర్పణతో సమస్య పరిష్కారం కాలేదు. ఇక్కడే అసలు ప్రశ్న: కమిషన్‌ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం, నివేదిక వచ్చిన తర్వాత దానిపై స్పష్టమైన నిర్ణయం ఎందుకు ప్రకటించడం లేదు? కమిషన్ పరిశీలించగలదు. గణాంకాలను సేకరించగలదు. సిఫారసులు చేయగలదు. కానీ వాటిని విధానంగా మార్చేది మాత్రం రాజకీయ సంకల్పం.

### క్రీమీ లేయర్ వేరు... ఉపవర్గీకరణ వేరు

ఓబీసీ చర్చలో తరచూ రెండు వేర్వేరు అంశాలు కలిసిపోతాయి --- క్రీమీ లేయర్, ఉపవర్గీకరణ. క్రీమీ లేయర్ విధానం ద్వారా ఓబీసీల్లో సామాజికంగా, ఆర్థికంగా ముందున్న వ్యక్తులు, కుటుంబాలను రిజర్వేషన్ నుంచి మినహాయిస్తారు. ఉపవర్గీకరణ మాత్రం ఓబీసీలకు కేటాయించిన 27 శాతం కోటాను వివిధ సమాజాల మధ్య ఎలా సమానంగా పంపిణీ చేయాలన్నది. ఒకటి వ్యక్తి లేదా కుటుంబ స్థాయిలో పనిచేస్తే, మరొకటి సామాజిక వర్గాల స్థాయిలో పనిచేస్తుంది.

### చట్టం కంటే రాజకీయమే పెద్ద అడ్డంకా?

2024 ఆగస్టు 1న స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దవీందర్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం, షెడ్యూల్డ్ కాస్ట్స్‌లో ఉపవర్గీకరణకు రాష్ట్రాలకు అధికారం ఉందని తీర్పు చెప్పింది. ఈ తీర్పు నేరుగా ఓబీసీలకు సంబంధించినది కాదు. అయినప్పటికీ, రిజర్వేషన్ కేటగిరీలలో అంతర్గత అసమానతలను గుర్తించి, వాస్తవ సమానత్వం కోసం ఉపవర్గీకరణ చేయవచ్చా అన్న చర్చకు ఇది కొత్త బలం ఇచ్చింది. అయితే అసలు అడ్డంకి చట్టం మాత్రమే కాదు --- రాజకీయాలు కూడా. 27 శాతం కోటాను పునర్విభజిస్తే కొందరు వర్గాలకు ప్రయోజనం, మరికొందరికి నష్టం కలగవచ్చు. ఇప్పటికే అధిక ప్రయోజనాలు పొందుతున్న వర్గాలు తమ వాటాను తగ్గించడానికి వ్యతిరేకించవచ్చు. అత్యంత వెనుకబడిన వర్గాలు మాత్రం తమకు ప్రత్యేక వాటా కోరవచ్చు. కానీ సామాజిక న్యాయాన్ని కేవలం ఎన్నికల గణితంగా మార్చకూడదు.


### ఇక నిర్ణయం తీసుకోవాల్సిన సమయం

రోహిణి కమిషన్ ఒక కీలక ప్రశ్నను మన ముందుంచింది: ఒకే కేటగిరీలో ఉన్న ప్రతి వర్గానికి ఒకే కోటా ఇవ్వడం సమానత్వమా? లేక వాస్తవ అసమానతలను గుర్తించి, అవసరమైన చోట భిన్నమైన అవకాశాలు కల్పించడమే నిజమైన సమానత్వమా? కేంద్ర ప్రభుత్వం రోహిణి కమిషన్ నివేదికపై తన వైఖరిని స్పష్టంగా ప్రకటించాలి. నివేదికను ప్రజా చర్చకు అందుబాటులోకి తీసుకురావాలి. అవసరమైన గణాంకాలను పారదర్శకంగా వెల్లడించాలి. రాష్ట్రాలు, ఓబీసీ సంఘాలు, రాజ్యాంగ నిపుణులు, సామాజిక శాస్త్రవేత్తలతో విస్తృత సంప్రదింపులు జరపాలి. 2023లో నివేదిక సమర్పించబడింది. 2026లో కూడా ప్రశ్న అలాగే ఉంది. ఓబీసీల్లో అత్యంత వెనుకబడిన వర్గాలు నిజంగా రిజర్వేషన్ ప్రయోజనాలను పొందుతున్నాయా? లేక రిజర్వేషన్ అనే తలుపు తెరిచి ఉన్నప్పటికీ, దాని తాళం కొద్దిమంది చేతుల్లోనే ఉందా? రిజర్వేషన్ ఉద్దేశం తలుపులు తెరవడం. ఆ తలుపులు అందరికీ సమానంగా తెరుచుకునేలా చేయడం --- అదే రోహిణి కమిషన్‌కు అసలు అర్థం.

**డా. ముచ్చుకోట సురేష్ బాబు.**

# గిరిజనులకు మేలు చేయని 1/70

షెడ్యూల్డ్ ఏరియాల్లో గిరిజనులు స్వేచ్ఛగా జీవించడానికి, వారి సంస్కృతి, సంప్రదాయాలు, ఆస్తులు, జీవన విధానాన్ని పరిరక్షించడానికి 1/70 చట్టాన్ని తీసుకువచ్చారు. కానీ ఈ యాభయ్యేళ్లలో అది గిరిజనులకు ఏ మేరకు ఉపయోగపడింది అన్నది ఇంకా ప్రశ్నగానే మిగిలి ఉన్నది. 1970 తర్వాత ఈ చట్టం గిరిజనులకు ఒక్క ఎకరం భూమినైనా పెంచగలిగిందా? అన్న ప్రశ్నకు మనం జవాబు ఆలోచించాలి. 1970 తర్వాత అడవిని కొట్టి కొత్తగా సాగులోకి తెచ్చుకున్న భూమిని పక్కనపెడితే, ఈ అయిదు దశాబ్దాల్లో గిరిజనేతరుల నుంచి చట్టబద్ధమైన క్రయవిక్రయాల ద్వారా గిరిజనులకు కొత్తగా సంక్రమించిన భూమి చాలా తక్కువ. అదే సమయంలో గిరిజనేతరుల మధ్య, వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు, ఒప్పందాలు, ఇతర మార్గాల ద్వారా పెద్ద ఎత్తున భూ లావాదేవీలు జరిగాయన్నది వాస్తవం. ఈ వ్యవహారాల్లో రెవెన్యూ అధికారులు, సిబ్బంది అక్రమంగా పెద్ద ఎత్తున సంపాదించుకున్నారన్నది బహిరంగ రహస్యం. 1/70 చట్టం ఒకవైపు గిరిజన భూములు గిరిజనేతరులకు వెళ్లకుండా అడ్డుకున్నది నిజమే కానీ, మరోవైపు గిరిజన రైతు తన భూమికి అవసరమైన సమయంలో సరైన విలువ పొందడానికి అడ్డంకిగా మారింది. గిరిజనుల భూమిని రక్షించాల్సిన 1/70 చట్ట సవరణ, అమలులో మాత్రం గిరిజన రైతుల ఆర్థిక స్వేచ్ఛకే పరిమితులు విధించే వ్యవస్థగా మారింది. పక్కనే 1/70 అమలు కాని మండలాల్లో వ్యవసాయ భూమి ఎకరానికి రూ.40--50 లక్షల వరకు విలువ పలికే పరిస్థితులు ఉన్నప్పుడు, 1/70 చట్ట పరిధిలోని ప్రాంతాల్లో అదే స్థాయి భూమి విలువ రూ.10 లక్షల లోపే ఉంది, అదే గిరిజనుల భూమి అయితే అంతకంటే తక్కువే. దీనికి ప్రధాన కారణాల్లో ఒకటి భూమి బదలాయింపుపై ఉన్న చట్టపరమైన ఆంక్షలు. అయితే తక్కువ ధరకు భూమి దొరుకుతుంది కదా అని ఉద్యోగాలు, వ్యాపారాల్లో ఆర్థికంగా మంచి స్థితికి చేరిన గిరిజనులు సైతం 1/70 ఏరియాలో భూములు కొనడానికి పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. భవిష్యత్తులో అవసరం వచ్చినప్పుడు తాము కొనుగోలు చేసిన భూమిని తిరిగి అమ్ముకోలేమనే భయమే దానికి కారణం. ఇది గిరిజనుల ఆర్థిక స్వేచ్ఛపై తీవ్రమైన చర్చకు దారితీసే అంశం. వ్యవసాయ భూమి రైతుకు కేవలం జీవనాధారం మాత్రమే కాదు. అది కుటుంబానికి ఆధారం. తమ ముందు తరతరాలకు ఆధారం. కష్టకాలంలో ఆర్థిక భద్రత. పిల్లల భవిష్యత్తుకు భరోసా. వ్యాపారం చేయడానికి పెట్టుబడి. అవసరమైనప్పుడు ఆర్థిక అభివృద్ధిలో ఒక అడుగు ముందుకు వేయడానికి మూలధనం. అలాంటి పరిస్థితిలో ఒక గిరిజన లేదా గిరిజనేతర రైతు తను సొంతంగా సంపాదించిన లేదా వారసత్వంగా వచ్చిన భూమిని తన అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునే లేదా, వారసులకు అందించే విషయంలో ఈ చట్టం గిరిజన/గిరిజనేతరుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తుంది, స్వేచ్ఛాయుత క్రయవిక్రయాల నిషేధం ఏ విధంగా న్యాయ సమ్మతం? గిరిజన ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి అవకాశాలు లేకుండా




చేయడం, ఉపాధి అవకాశాలు రాకుండా చేయడం, భూమిని ఆర్థిక ఆస్తిగా వినియోగించుకునే మార్గాలను పూర్తిగా మూసివేయడం ద్వారా గిరిజనులను అభివృద్ధి చేశామని ప్రభుత్వాలు భావిస్తే, దానికంటే శోచనీయమైన విషయం మరొకటి ఉండదు. రక్షణ అంటే అభివృద్ధిని అడ్డుకోవడం కాదు; గిరిజనుడి హక్కును కాపాడుతూ, అతనికి అభివృద్ధి అవకాశాలను కల్పించడం. గిరిజనుల భూమిని కాపాడటమన్న 1/70 చట్టం ఉద్దేశాన్ని ఎవరూ వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. కానీ 55 సంవత్సరాల తర్వాత మారిన పరిస్థితులకు అనువుగా ఈ చట్టాన్ని సమీక్ష చేయాల్సిన అవసరం ఉంది. ఈ చట్టం గిరిజనుల భూమిని ఎంతవరకు కాపాడింది? గిరిజనుల ఆర్థిక స్థితిని ఎంతవరకు మెరుగుపరిచింది? వారి భూమి విలువను ఎంత పెంచింది? భూ బదలాయింపుపై ఆంక్షల వల్ల గిరిజనులకు జరిగిన మంచీ చెడూ ఏమిటి? ఈ అంశాలన్నిటిపైనా లోతైన సమీక్ష జరగాలి. గిరిజనుల భూమిని రక్షించాలి. అదే సమయంలో గిరిజనుల ఆర్థిక స్వేచ్ఛను కూడా రక్షించాలి.

**మంధనపు రామారావు**

# లింగంగుంట అంజనేయస్వామి శిలా ప్రతిష్ఠకు రూ.లక్ష విరాళం

**నెల్లూరు డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డి ఉదార సహకారం**



నెల్లూరు /అనంతసాగరం (స్టేట్ రిపోర్ట్ బ్యూరో ) అనంతసాగరం మండలం లింగంగుంట గ్రామంలో శ్రీ కోదండరాముని సమేత శ్రీ అంజనేయస్వామి వారి శిలా ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలకు నెల్లూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డి రూ.1 లక్ష(100000/-) విరాళంగా అందించారు.సెప్టెంబర్ 5, 6, 7 తేదీలలో శ్రీ కోదండరాముని సమేత శ్రీ లింగంగుంట అంజనేయస్వామి వారి శిలా ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరగనుంది. ఈ సందర్భంగా నిర్వహించనున్న వివిధ పూజా కార్యక్రమాలు, ధార్మిక కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణకు ధనుంజయ రెడ్డి తన వంతు సహకారంగా రూ.1,00,000 విరాళాన్ని అందజేశారు. దేవాలయ నిర్మాణం, గ్రామాభివృద్ధి, ధార్మిక కార్యక్రమాలకు మెట్టుకూరు కుటుంబం ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోమెట్టుకూరు కృష్ణారెడ్డి సహకారం కూడా ఉందని తెలిపారు. శ్రీ ఆంజనేయస్వామి వారి ఆశీస్సులతో మెట్టుకూరు ధనుంజయ రెడ్డి, కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు, మెట్టుకూరు బ్రదర్స్ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని గ్రామ ప్రజలు ఆకాంక్షించారు. వారి ఉదార సహకారానికి ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు, భక్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగామహానేత రాజశేఖర్ రెడ్డికి ఘన నివాళులర్పించిన.. ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి



నెల్లూరు (ఇదినిజం ప్రతినిధి ): నెల్లూరు గాంధీ బొమ్మ సెంటర్ లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి.. వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు.. జోహార్ వైఎస్ఆర్ అంటూ ఆ మహానేత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.ఈ సందర్భంగా పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూవైయస్ రాజశేఖర్ రెడ్డి మనకు దూరమై17 ఏళ్ళు అయినప్పటికీ ఆయన ప్రతి పేదవాడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉన్నారని తెలిపారు.ముఖ్యమంత్రిగా రాజశేఖర్ రెడ్డి అందించిన సేవలుమరువలేవని తెలిపారు ముఖ్యంగా ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్,ఉచిత విద్యుత్, జలయజ్ఞం పథకాలతో.. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిన మహనీయుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి గారని కొనియాడారు.ఆ మహానేత ఆశయాలను ముందుకు తీసుకువెళ్లే దిశగా వారి తనయుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి గత ఐదేళ్లు ముఖ్యమంత్రిగాప్రజా పరిపాలన సాగించారని తెలిపారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం.. ప్రజలను దగా చేసి వంచనకు గురిచేసిందన్నారు.మళ్లీ ఈ రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలన రావాలని.. జగన్మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.ప్రజల ఆకాంక్షలకు . అనుగుణంగా రాబోయే.. రోజుల్లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యి ప్రజలకు.. సుపరిపాలన అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముట్టింబాకలో ఘనంగా వైఎస్సార్ వర్ధంతి వేడుకలు

**వైయస్సార్ సేవలు చిరస్మరణీయం నేదురమల్లి రామ్ కుమార్ రెడ్డి**



వాకాడు.(ఇదినిజం ప్రతినిది ) తిరుపతి జిల్లా వాకాడు మండల పరిధిలోని ముట్టింబాక గ్రామంలో మాజీ సర్పంచ్ నల్లారెడ్డి అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాంకుమార్ రెడ్డి, గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి జాలాభిషేకం చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ అమలు చేసిన పథకాలు ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపాయని తెలిపారు.ముఖ్యంగా ఫీజు రీయింబర్స్మెంట్ పథకం ద్వారా పేద విద్యార్థులకు బంగారు భవిష్యత్తు లభించిందని, ప్రజా సంక్షేమం పట్ల ఆయన చూపిన అంకితభావం ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు.వైఎస్సార్సీపీ నాయకులు కొడవలూరు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ, 'ది విజన్ ఆఫ్ వైఎస్సార్, ది డ్రీమ్ ఆఫ్ ఎన్జేఆర్'కు నిదర్శనంగా నిలిచిన స్వర్ణముఖి బ్యారేజీ ఈ తూర్పు తీర ప్రాంత రైతులకు అతిపెద్ద వరమని, వాకాడు ప్రజలు వైఎస్సార్కి ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని తెలిపారు. నాటి ఉచిత విద్యుత్, రుణమాఫీ పథకాలు రైతులకు కొండంత భరోసానిచ్చాయని పేర్కొన్నారు.ప్రస్తుత రాజకీయ పరిస్థితులను సరిచేయాలంటే మళ్లీ వైసీపీ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పాలనను దృష్టిలో ఉంచుకుని పార్టీకి అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వాకాడు మండల వైసీపీ అధ్యక్షుడు ఏనుగు సుధాకర్ నాయుడు, జడ్పీటీసీ సభ్యుడు రౌతు రామకృష్ణ, మాజీ ఉప సర్పంచ్ పాపారెడ్డి రాజశేఖర్ రెడ్డి, నేదురుమల్లి హిమ కుమార్ రెడ్డి, దువ్వూరు భాస్కర్ రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు సంపత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు లోక కళ్యాణ్ రెడ్డి, దువ్వూరు మధు రెడ్డి, నల్లారెడ్డి మధు రెడ్డితో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇస్రో చైర్మన్ డాక్టర్ వి నారాయణన్ శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు



సూళ్లూరుపేట.శ్రీహరికోట (ఇది నిజం ప్రతినిధి)తిరుపతి జిల్లా సూళ్లూరుపేట. శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుండి ఈనెల 4 వ తేదీన నింగిలోకి పంపనున్న +జూాం-ఖీ17 జుూూ-05 రాకెట్ విజయవంతం కావాలని సూళ్లూరుపేటలో వెలసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి ఇస్రో చైర్మన్ డాక్టర్ వి నారాయణన్ ను మంగళ వాయిద్యాలతో సాదరంగా ఆహ్వానించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో వేద పండితులచే ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మణ్ణి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

# చింతం రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వైఎస్సార్ 17వ వర్ధంతి వేడుకలు

**పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్సార్ సేవా, సంక్షేమ పాలనకు ఆయన ఆదర్శం**



సీతారామపురం(ఇది నిజం ప్రతినిధి) దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి వేడుకలను సీతారామపురం బస్టాండ్ సెంటర్లో ఎంపీపీ చింతం రెడ్డి పద్మావతి, వైసిపి మండల కన్వీనర్ చింతం రెడ్డి సుబ్బారెడ్డి, యువ నాయకుడు చింతం రెడ్డి లోకేష్ రెడ్డి ల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గూడపురెడ్డి వీరశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. వైఎస్సార్ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానేత వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు రాజకీయ చరిత్రలో చెరగని ముద్ర వేసిందన్నారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, కార్మికులు, బలహీన వర్గాల సంక్షేమానికి ఆయన తీసుకున్న నిర్ణయాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకొచ్చాయని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్, జలయజ్ఞం వంటి కార్యక్రమాల ద్వారా సామాన్య ప్రజలకు అండగా నిలిచిన నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు.వైఎస్సార్ పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నేటికీ ప్రజల మదిలో నిలిచిపోయాయని నాయకులు అన్నారు. పేదవాడి కష్టాన్ని తన కష్టంగా భావించి ప్రజల మధ్య తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేసిన ప్రజా నాయకుడిగా వైఎస్సార్ చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. ఆయన మరణించి 17 ఏళ్లు గడిచినా ప్రజల గుండెల్లో మాత్రం ఆయనపై అభిమానం ఏమాత్రం తగ్గలేదని అన్నారు.జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిస్తూ రైతాంగానికి భరోసా కల్పించిన ఘనత వైఎస్సార్కే దక్కుతుందని నాయకులు పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకురావడం, ఫీజు రీయింబర్స్మెంట్ ద్వారా పేద విద్యార్థులకు ఉన్నత విద్యకు అవకాశం కల్పించడం వంటి నిర్ణయాలు ఆయన ప్రజా సంక్షేమ దృక్పథానికి నిదర్శనమన్నారు.వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని నాయకులు స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, పేదల ఆత్మగౌరవం కోసం ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జడ్పిటిసి చెరుకుపల్లి రమణారెడ్డి, వైస్ ఎంపీపీ బసిరెడ్డి కృష్ణారెడ్డి, ప్రముఖ న్యాయవాది చింతం రెడ్డి సుషిత రెడ్డి, ఎంపీటీసీ పి.సి.అల్లూరు రాజు, మండల వైసీపీ యూత్ అధ్యక్షుడు పాలగిరి ముద్దుకృష్ణమరాజు, మాజీ వైస్ ఎంపీపీ రామిశెట్టి తిరుపతయ్య, మాజీ సర్పంచులు చప్పిడి తిరుపతిరెడ్డి, దుర్గయ్య యాదవ్, చంద్రమౌళి, దుర్గయ్య నాయకులు బాలినేని మాబయ్య, పోరుమామిళ్ల కాశయ్య, చింతం రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, కలివేల సతీష్, పాలకొలను వెంకటరెడ్డి, లకిడి బ్రహ్మయ్య, గుర్రం సుబ్బయ్య, తమ్మిశెట్టి శ్రీనివాసులు, పెద్దపులి హైదరవలి, మామిళ్ళ సురేష్ తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నలిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు....




ఆత్మకూరు (ఇదినిజం ప్రతినిధి ): జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకులు నలిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తీన్మార్ డప్పులుతో, బాణాసంచా మోతలతో, జన సైనికులు,వీర మహిళలు కేరింతల కొడుతూ ఆత్మకూరు పట్టణంలోని సత్రం సెంటర్ నుండి ఎల్.ఆర్.పల్లి నెల్లూరు పాలెం మీదుగా స్థానిక శ్రీధర్ గార్డెన్స్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం శ్రీధర్ గార్డెన్స్ లో నిర్వహించిన వర్చువల్ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాల అనంతరం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో జనసైనికులు రక్తదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జనసేన నేత నలిసెట్టి శ్రీధర్ మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ పుట్టినరోజు, జనసైనికులందరికీ పండుగ రోజు అని పేర్కొన్నారు. 2014లో ఆవిర్భవించిన జనసేన పార్టీ నేటి వరకు పుష్కర కాల ప్రస్థానంలో పవన్ కళ్యాణ్ గారు ఎన్నో నిర్బంధాలను, అవమానాలను భరిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్తు కోసం ముందడుగు వేశారు. తనతో పాటు జనసైనికులను నడిపించారు. పవన్ కళ్యాణ్ గారు చూపిన బాటలోనే, ఆయన స్ఫూర్తితో ఆత్మకూరు నియోజకవర్గం జనసేన సీనియర్ నాయకులు నలిశెట్టి శ్రీధర్ జనసైనికులు కలుపుకొని, నియోజకవర్గ ప్రధాన సమస్యలైన చుక్కల భూములు సమస్య, సీ.జె.యెఫ్ .స్ భూముల సమస్య పై అలుపెరగని పోరాటం చేశారు. అంతేకాకుండా ఆత్మకూరు మెట్ట ప్రాంత వాసుల చిరకాల కల నడికుడి శ్రీకాళహస్తి రైల్వే మార్గాన్ని త్వరగా పూర్తి చేయాలని, ఆత్మకూరు మెట్ట ప్రాంతానికి సాగు మరియు తగు నీరు అందించే ఆనం సంజీవరెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరడం జరిగింది. ఆత్మకూరు నియోజకవర్గం లోని సహజ వనరులైన, ఇసుక మరియు గ్రావెల్ ను యదేచ్ఛగా దోపిడీ చేసిన నాటి వైసిపి ప్రభుత్వానికి ఎదురొడ్డి నిలబడ్డారు. ఈ సందర్భంగా ఎన్నో పోలీసులు నిబంధనలను,వైసిపి గుండాల దాడులకు వెరవకొండా జనసైనికులు అందరూ సంయుక్తంగా పోరాటం చేశారు. పవన్ కళ్యాణ్ గారి ఆదేశానుసారం గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి జనసైనికులు అందరూ రేయింబవళ్లు కష్టపడి శ్రమించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నలిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ పెద్దపెద్ద పార్టీలే గత వైసిపి ప్రభుత్వ దౌర్జన్యాలకు,దాడులకు భయపడి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకుండా తప్పుకుంటే, వైసిపి నాయకుల దౌర్జన్యాలకు, దాడులకు ఎదురొడ్డి కలబడి, నిలబడిన దమ్మున్న పార్టీ జనసేన పార్టీ అని పేర్కొన్నారు. మా పవన్ కళ్యాణ్ గారు ఆంధ్ర రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా కూటమి ప్రభుత్వం 15 ఏళ్ల పాటు కలసి పోటీ చేయవలసిన అవసరం ఉందని మా జనసైనికులందరికీ ఆదేశించడం జరిగింది. పవన్ కళ్యాణ్ గారి ఆదేశాలను శిరసా వహిస్తూ జనసైనికులు అందరూ తలవంచుకొని ఎంతో సంయమనముతో ఉన్నారు. జనసైనికుల సంయమనాన్ని చేతకానితనంగా భావించవద్దని కూటమి ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్న పార్టీ పెద్దలకు శిరస్సు వంచి నమస్కరిస్తూ నలిశెట్టి శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, తెలుగుదేశం పార్టీ పెద్దలు పెద్దన్నయ్య పాత్ర పోషిస్తూ జనసేన తమ్ముళ్లను కలుపుకొని పోతే స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి అభ్యర్థులు తిరిగి విజయ దుందుభి మోగిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న జనసేన శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొందాం జరిగింది.

# ఏటూరు లో పేకాట స్థావరంపై దాడులు చేజర్ల ఎస్సై అయ్యప్ప



చేజర్ల సెప్టెంబర్ 02 (ఇదినిజం ప్రతినిధి కామంచి హజరత్) చేజర్ల మండలంలోని ఏటూరు గ్రామంలో పొలాల్లో పేకాట ఆడుతున్న జూదరులపై చేజర్ల మండల ఎస్సై అయ్యప్ప బుధవారం మెరుపు దాడి చేశారు.ముగ్గురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా సమాచారం తెలుసుకున్న ఎస్ఐ అక్కడికి చేరుకుని వారిని పట్టుకోవడం జరిగినది.వారి వద్ద నుండి 7600 రూపాయలు నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ అయ్యప్ప తెలిపారు.

# వినాయక చవితి వేడుకల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**చర్చిలు, మసీదులు, ప్రార్థనా మందిరాల సమీపంలో విగ్రహాల ఏర్పాటుకు దూరంగా ఉండాలి**

**డీజేలు, రికార్డింగ్ డ్యాన్సులు, మద్యం సేవించి హల్‌చల్ చేస్తే ఉపేక్షించేది లేదు: డీఎస్పీ చెంచుబాబు వెల్లడి**

సూళ్లూరుపేట. (ఇది నిజం ప్రతినిది) వినాయక చవితి పండుగను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని నాయుడుపేట డీఎస్పీ జి. చెంచుబాబు సూచించారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉత్సవ కమిటీలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీసుల అనుమతులు లేకుండా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు.


వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే ప్రాంతాలను ముందుగానే పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ముఖ్యంగా చర్చిలు, మసీదులు, ఇతర ప్రార్థనా మందిరాల సమీపంలో విగ్రహాలను ఏర్పాటు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే పరిస్థితులు ఏర్పడకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని, ఇతర మతాల మనోభావాలను గౌరవించాలని కోరారు.

**"అనుమతులు తప్పనిసరి"**

వినాయక మండపాల ఏర్పాటుకు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు తీసుకోవాలని డీఎస్పీ సూచించారు. మండపాల వద్ద విద్యుత్ భద్రత, అగ్నిప్రమాద నివారణ చర్యలు, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఊరేగింపుల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచించిన మార్గాల్లోనే కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు.

**"డీజేలు, అధిక శబ్దానికి నో"**

వినాయక చవితి పేరుతో డీజే బాక్సులు ఏర్పాటు చేసి అధిక శబ్దంతో పాటలు వినిపించడం, ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా రాత్రి వేళల్లో శబ్దాలు చేయడం వంటివి చేయరాదని డీఎస్పీ హెచ్చరించారు. అనుమతులు లేకుండా డీజేలు,




సౌండ్ సిస్టమ్స్ వినియోగిస్తే వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**"రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహిస్తే చర్యలు"**

వినాయక ఉత్సవాల సందర్భంగా రికార్డింగ్ డ్యాన్సులు వంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు అనుమతి లేదని తెలిపారు. పండుగను భక్తి, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించాలి తప్ప అసభ్యకరమైన లేదా ఇతరులకు ఇబ్బంది కలిగించే కార్యక్రమాలకు వేదికగా మార్చరాదన్నారు.

**"మద్యం సేవించి వీధుల్లో హల్‌చల్ చేస్తే కఠిన చర్యలు"**

యువత మద్యం సేవించి రోడ్లపై హల్‌చల్ చేయడం, వాహనాలతో ప్రమాదకరంగా తిరగడం, ఇతరులతో గొడవలకు దిగడం వంటి చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని డీఎస్పీ చెంచుబాబు హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

**"శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి"**

వినాయక చవితి సందర్భంగా ఎలాంటి చిన్న సంఘటన కూడా పెద్ద సమస్యగా మారకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని డీఎస్పీ కోరారు. ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులతో సమన్వయం చేసుకుని కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించినా, ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. పండుగ అనేది అందరూ ఆనందంగా జరుపుకునే వేడుక అని, ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డీఎస్పీ చెంచుబాబు పేర్కొన్నారు. పోలీసుల సూచనలు, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ వినాయక చవితిని ప్రశాంతంగా విజయవంతంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

# పదవీకాలం పూర్తి చేసుకున్న ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం



సీతారామపురం (ఇది నిజం ప్రతినిధి) సీతారామపురం మండల పరిషత్ అధ్యక్షురాలు (ఎంపీపీ), జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం పూర్తయిన సందర్భంగా వారికి ఎంపీపీ చింతం రెడ్డి పద్మావతి, వైసీపీ మండల కన్వీనర్ చింతం రెడ్డి సుబ్బారెడ్డి, మండల యువ నాయకుడు చింతం రెడ్డి లోకేష్ రెడ్డిల ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉదయగిరి నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి మేకపాటి రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదవీకాలంలో ప్రజలకు అందించిన సేవలను నాయకులు, ప్రజాప్రతినిధులు కొనియాడారు. సీతారామపురం మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు చేసిన కృషి అభినందనీయమన్నారు. ప్రజలతో మమేకమై పనిచేసి తమ పదవులకు వన్నె తెచ్చారని పేర్కొన్నారు.అనంతరం పదవీకాలం పూర్తి చేసుకున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను వారితో పాటు మాజీ సర్పంచ్లను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ప్రజాసేవకు అవకాశం కల్పించిన ప్రజలకు, సహకరించిన నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చెరుకుపల్లి రమణారెడ్డి, వైస్ ఎంపీపీలు బసిరెడ్డి కృష్ణారెడ్డి, సారమ్మ, ఎంపీటీసీ సభ్యులు పి.సి అల్లూరు రాజు, మండల యూత్ అధ్యక్షుడు పాలగిరి ముద్దుకృష్ణమరాజు, మాజీ వైస్ ఎంపీపీ రామిశెట్టి తిరుపతయ్య, మాజీ ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధిపై సమగ్ర చర్చ మండల సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపిపి చింతం రెడ్డి పద్మావతి




సీతారామపురం (ఇది నిజం ప్రతినిధి) మండల అధ్యక్షురాలు చింతం రెడ్డి పద్మావతి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్యుత్, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి హామీ తదితర అంశాలపై ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి సమస్యలను తీసుకువచ్చారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలవుతున్న సంక్షేమ పథకాలపై వివరాలు వెల్లడించారు.మండలంలోని ప్రజా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మండల అధ్యక్షురాలు చింతం రెడ్డి పద్మావతి సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె పేర్కొన్నారు.సమావేశంలో చర్చకు వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని, అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జె.చిన్న చెన్నరావు,జెడ్పీటీసీ చెరుకుపల్లి రమణారెడ్డి, వైస్ ఎంపిపి లు బసిరెడ్డి కృష్ణారెడ్డి, నేలటూరి సారమ్మ, ఎంపీటీసీ సభ్యులు పి.సి. అల్లూరు రాజు, లక్ష్మీకాంతమ్మ, తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ, చప్పిడి వెంకటమ్మ కోఆప్షన్ నెంబర్ పెద్దపులి హైదర్ వలి,మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



సీతారామపురం (ఇది నిజం ప్రతినిధి) జనసేన నేత భోగినేని కాశీ రావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ.. ఘనంగా కేక్ కటింగ్ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని జనసేన నేత భోగినేని కాశీ రావు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎల్వీఆర్ జూనియర్ కళాశాల సమీపంలోని బైపాస్ కూడలి నుండి బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ జరిగింది. జనసేన పార్టీ జెండాలు చేతబూనిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొని పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ జన్మదిన కేక్‌ను భోగినేని కాశీ రావు కట్ చేసి కార్యకర్తలకు, అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కళ్యాణ్ తనదైన సిద్ధాంతాలతో ముందుకు సాగుతున్నారని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి, రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, పర్యావరణ పరిరక్షణ, ప్రజా సంక్షేమం వంటి అంశాలకు పవన్ కళ్యాణ్ ప్రాధాన్యత ఇస్తున్నారని భోగినేని కాశీ రావు అన్నారు. ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించేందుకు ఆయన చేస్తున్న కృషికి జనసేన కార్యకర్తలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించి మరింత కాలం ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. జనసేన పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు భోగినేని కాశిరత్తయ్య (గాంధీ) టిడిపి మాజీ కన్వీనర్ లు కప్పు ప్రభాకర్ రాజు, వెంగళ శెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి మండల యూత్ అధ్యక్షుడు పసుపులేటి వికాస్ బాబు, ఊర చెరువు సాగునీటి సంఘం ఛైర్మన్ నీలిరత్తయ్య, కార్యకర్తలు, యువత, పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆత్మకూరులో అంగరంగ వైభవంగా జనసేనాని జన్మదిన వేడుకలు...

**చదలవాడ హరీష్ కుమార్ నేతృత్వంలో రాములవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, భారీ బైక్ ర్యాలీ.**

**యూత్ కమిటీ లోగో ఆవిష్కరణ లైవ్‌తో పండుగ వాతావరణాన్ని తలపించిన ఆత్మకూరు**




ఆత్మకూరు (ఇదినిజం ప్రతినిధి ): జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలో పండుగ వాతావరణంలో అత్యంత ఘనంగా జరిగాయి. ఆత్మకూరు జనసేన పార్టీ సీనియర్ నాయకులు చదలవాడ హరీష్ కుమార్ ముందుండి నడిపించిన ఈ వేడుకలు నియోజకవర్గవ్యాప్తంగా కనీవినీ ఎరుగని రీతిలో సాగాయి. కార్యక్రమంలో భాగంగా మొదటగా ఆత్మకూరు హైవే సమీపంలోని ప్రసిద్ధ శ్రీ రాములవారి ఆలయిలో చదలవాడ హరీష్ కుమార్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్ ఆరోగ్యం సంపూర్ణంగా కుదుటపడి, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణం నుండి హరీష్ కుమార్ ఆధ్వర్యంలో వందలాది ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ ప్రారంభమైంది. దారిపొడవునా పార్టీ జెండాలు చేతబూని, డీజేల హోరుతో జనసైనికులు తమ ప్రియతమ నాయకుడిపై ఉన్న ప్రేమాభిమానాలను చాటుకున్నారు. ఈ ఊరేగింపు ఆత్మకూరు బస్టాండ్ సెంటర్‌కు చేరుకున్న అనంతరం, రాజ్యాంగ నిర్మాత




డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి చదలవాడ హరీష్ కుమార్ మరియు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పవన్ కళ్యాణ్ గారి అనారోగ్యం దృష్ట్యా, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన "యూత్ కమిటీ లోగో ఆవిష్కరణ" ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆత్మకూరులోని 'రెడ్డి గారి విందు కాన్ఫరెన్స్ హాల్' నందు డిజిటల్ స్క్రీన్‌పై ఏర్పాటు చేసిన ఈ లైవ్ ప్రోగ్రామ్‌లో హరీష్ కుమార్‌తో పాటు జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకించారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్లో చదలవాడ హరీష్ కుమార్ భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు, అభిమానులకు పంచిపెట్టారు. సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాల నడుమ ఆత్మకూరు చరిత్రలోనే నిలిచిపోయేలా వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన ముఖ్య నాయకులు ముత్తంశెట్టి కృష్ణ, అరవ ప్రవీణ్ కుమార్, భాను, షాఖ నజీర్, కమల్, పసుపులేటి సాయిరాం, బుజ్జి, రాజు, షా. ప్రసాద్, హజరత్‌లతో పాటు భారీ సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యను గుర్తించిన శంకర్ రెడ్డి పరిష్కారానికి ముందుకొచ్చిన కృష్ణమూర్తి రెడ్డి

**శంకర్ రెడ్డి చొరవతో.రూ.80 వేల సొంత నిధులతో వీధిలైట్లు అందించిన కృష్ణమూర్తి రెడ్డి**



సూళ్లూరుపేట డివిజన్ ఇన్చార్జి వరదయ్యపాలెం మండలం ఇది నిజం ప్రతినిధి. : తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంకర్ రెడ్డి చొరవ చూపుతున్నారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కృష్ణమూర్తి రెడ్డి తెలిపారు. వరదయ్యపాలెం మండలం చిలమత్తూరు గ్రామంలో వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని శంకర్ రెడ్డి దృష్టికి తీసుకురావడంతో, సమస్య పరిష్కారానికి ఆయన వెంటనే చర్యలు చేపట్టారు. శంకర్ రెడ్డి సూచన మేరకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కృష్ణమూర్తి రెడ్డి తన సొంత నిధులతో సుమారు రూ.80 వేల విలువైన వీధి దీపాలను సమకూర్చారు.అనంతరం సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంకర్ రెడ్డి చేతుల మీదుగా వీధి దీపాలను గ్రామస్థులకు అందజేశారు. దీంతో గ్రామంలో రాత్రివేళల్లో వెలుతురు సమస్యకు పరిష్కారం లభించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కృష్ణమూర్తి రెడ్డి మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు ఏ సమస్య వచ్చినా శంకర్ రెడ్డి ముందుండి పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి, వాటికి అవసరమైన సహాయాన్ని అందించడంలో ఆయన చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు.శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా కొనసాగుతాయని కృష్ణమూర్తి రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా తన వంతు సహకారం అందిస్తూ, అవసరమైన చోట సొంత నిధులతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని తెలిపారు.చిలమత్తూరు గ్రామ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన శంకర్ రెడ్డికి, రూ.80 వేల విలువైన వీధిలైట్లను సొంత నిధులతో అందించిన కృష్ణమూర్తి రెడ్డికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## వైఎస్సార్ వర్ధంతి వేడుకలు ఘనం,పేదల గుండెల్లో కొలువైన మహానేత వైఎస్సార్

**ఆయన సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర**

**జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్‌తో పేదలకు భరోసా,మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య**

సూళ్లూరుపేట డివిజన్ ఇన్చార్జి నాయుడుపేట అర్బన్ ఇది నిజం ప్రతినిధి. : తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట పట్టణంలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి వేడుకలను బుధవారం నాయుడుపేటలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ వైఎస్సార్ పేదల గుండెల్లో దేవుడిగా కొలువైన మహానేత అని కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశాయని అన్నారు. రైతుల కోసం చేపట్టిన జలయజ్ఞం, పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, విద్యార్థుల ఉన్నత విద్యకు ఊతమిచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు భరోసా కల్పించిన ఉచిత విద్యుత్ పథకాలు వైఎస్సార్ పాలనలో కీలకంగా నిలిచాయని తెలిపారు.వైఎస్సార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే పేదలకు విద్య, వైద్యం అందుబాటులోకి తీసుకురావడంతో పాటు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చారని చెప్పారు.వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులకు ప్రోత్సాహం, పేద



కుటుంబాలకు ఆరోగ్య రక్షణ వంటి చర్యలతో ఆయన ప్రజాబంధువుగా నిలిచారని పేర్కొన్నారు. వైఎస్సార్ పాలనను ప్రజలు నేటికీ స్వర్ణయుగంగా గుర్తుచేసుకుంటున్నారని అన్నారు.వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆశయాలను కొనసాగిస్తూ ఆయన తనయుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర పరిపాలనలో అనేక మార్పులు తీసుకొచ్చారని సంజీవయ్య తెలిపారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రతిపక్షంగా ప్రశ్నిస్తుంటే ప్రభుత్వం వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై విమర్శలు చేస్తూ కాలయాపన చేస్తోందని ఆరోపించారు.చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రావెల్, ఇసుక, మట్టి, లిక్కర్ అక్రమ దందాలు పెరిగాయని విమర్శించారు.ప్రజా సమస్యలను పరిష్కరించకుండా ప్రశ్నించే గొంతులను అణచివేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. భారత రాజ్యాంగానికి బదులుగా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మద్దాలి సోమశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి, నాయుడుపేట ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, మండల అధ్యక్షులు ఒట్టూరు కిషోర్‌యాదవ్, ఓజిలి మండల అధ్యక్షులు పాదర్తి హరినాథ్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కటకం దీపిక, నాయుడుపేట ఎంపీపీ కొరుగొండ ధనలక్ష్మి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఈదా రత్నశ్రీ, మాజీ వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షులు చదలవాడ కుమార్, మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ షబ్బీర్, వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



సూళ్లూరుపేట డివిజన్ ఇన్చార్జి నాయుడుపేట అర్బన్ ఇది నిజం ప్రతినిధి. :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధ్యక్షుడు కోణేదల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని నాయుడుపేట పట్టణంలో అట్లా కృష్ణారావు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయుడుపేటలోని గాంధీ మందిరం నుంచి అంబేద్కర్ విగ్రహం సర్కిల్ మీదుగా జనసేన పార్టీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. జనసేన పార్టీ జెండాలతో నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. జనసేన పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను నాయుడుపేటలో ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పవన్ కళ్యాణ్‌కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన అగ్రి ఎక్స్‌పో కిసాన్ మేళా

సూళ్లూరుపేట డివిజన్ ఇన్చార్జి నాయుడుపేట అర్బన్ ఇది నిజం ప్రతినిధి. : తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం ?నాయుడుపేటలోఅగ్రి ఎక్స్‌పో ఞ కిసాన్ మేళా కార్యక్రమం జరిగింది. రైతుల కోసం సుమారు 40 స్టాల్స్ ఏర్పాటు చేశారు.కిసాన్ మేళాలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ, తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు.సాంకేతికతతో వ్యవసాయాన్ని పండుగ చేయడమే చంద్రబాబు లక్ష్యం అని ఎమ్మెల్యే విజయశ్రీ తెలిపారు.?నాయుడుపేట పట్టణంలో వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ‘అగ్రి ఎక్స్‌పో మరియు కిసాన్ మేళా - 2026’ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల అవగాహన కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సుమారు 40 కి పైగా వ్యవసాయ స్టాల్స్‌ను ఎమ్మెల్యే డా. విజయశ్రీ, జిల్లా కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. ఈ ప్రదర్శనలో ఉంచిన ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు, డ్రోన్ల వినియోగం, నూతన యంత్రాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మరియు విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. డ్రోన్ టెక్నాలజీ ప్రదర్శన రైతులను విశేషంగా ఆకట్టుకుంది. ?అనంతరం సభను ఉద్దేశించి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు దార్శనికతతో, వ్యవసాయాన్ని దండగ కాదు పండుగ అని నిరూపించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వం అరకొరగా రూ.13,500 ఇస్తే, మన ప్రభుత్వం వరుసగా రెండో ఏడాది కూడా ‘అన్నదాత సుఖీభవ’ కింద రూ. 20,000 అందిస్తూ రైతులకు అండగా నిలుస్తోంది. రాత్రి వేళల్లో రైతుల కష్టాలు తీర్చేందుకు పగటిపూటే 9 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పాటు, సాగునీటి కోసం కొత్తగా లక్షకు పైగా ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చాం,” అని వివరించారు. అలాగే, రైతులపై పెట్టుబడి భారం పడకుండా ఆధునిక డ్రోన్లపై 80-90 శాతం భారీ సబ్సిడీని ప్రభుత్వమే భరిస్తోందని ఎమ్మెల్యే గుర్తుచేశారు. రైతులు ఈ నూతన సాంకేతికతలను అందిపుచ్చుకుని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించి ఆర్థికంగా ఎదగాలని ఆమె పిలుపునిచ్చారు.?ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు మరియు పెద్ద సంఖ్యలో రైతు సోదరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ పై జడ్పీ డిప్యూటీ సీఈవో సమీక్ష



సీతారామపురం (ఇది నిజం ప్రతినిధి) మండలంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ వెరిఫికేషన్ ప్రక్రియ పై జెడ్పీ డిప్యూటీ సీఈఓ బ్రహ్మయ్య బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఓటర్ల వివరాల పరిశీలనకు సంబంధించిన పురోగతిపై ఎంపీడీఓ ను అడిగి వివరాలు తెలుసుకున్నారు.వెరిఫికేషన్ ప్రక్రియలో ఎలాంటి తప్పులు, పొరపాట్లకు తావులేకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు, బీఎల్ఓలకు సూచించారు. ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జె. చిన్న చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## సుళ్లూరుపేట మండలంలో ఎస్సీ/ఎస్టీ/బీసీ ఓటర్ల జాబితా ధృవీకరణకు గ్రామసభలు




సూళ్లూరుపేట. (ఇదినిజం ప్రతినిది) గ్రామ పంచాయతీ ఎన్నికలు--2026 నేపథ్యంలో గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితాలో ఎస్సీ (ూజ), ఎస్టీ (ూు), బీసీ (దీజ) ఓటర్ల గుర్తింపు మరియు ధృవీకరణ కోసం సుళ్లూరుపేట మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు సుళ్లూరుపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి తెలిపారు. జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు, గ్రామ పంచాయతీల వారీగా ఎస్సీ/ఎస్టీ/బీసీ ఓటర్ల జాబితాలను గ్రామసభ ముందు ఉంచి, ప్రజల సమక్షంలో పరిశీలించి అవసరమైన సవరణలను నమోదు చేయనున్నారు. గ్రామసభలో చేసిన సవరణలను హాజరయ్యే సీనియర్ అధికారి ధృవీకరిస్తారు.

**సుళ్లూరుపేట మండల గ్రామసభల షెడ్యూల్**

03/09/2026 ఉదయం 9.00 గంటలకు: అబాక, దామనెల్లూరు, దామరాయ, ఇలుపూరు, కె.సి.ఎన్.గుంట

03/09/2026 మధ్యాహ్నం 2.00 గంటలకు: గోపాలరెడ్డిపాలెం, కొరిడి, కోటపోలూరు, కుదిరి, మంగళంపాడు.

05/09/2026 ఉదయం 9.00 గంటలకు:మంగానెల్లూరు, మన్నెముత్తేరి, మతకమూడి, సామంతమల్లం, సుగ్గుపల్లి.

05/09/2026 మధ్యాహ్నం 2.00 గంటలకు:కడపత్ర, నాదెండ్లవారి కండ్రిగ, ఉగ్గుమూడి, వెలెగల పొన్నూరు.

ప్రజలు తమ గ్రామ పంచాయతీకి సంబంధించిన ూజ/ూు/దీజ ఓటర్ల జాబితాను పరిశీలించి, అభ్యంతరాలు లేదా అవసరమైన సవరణలు ఉంటే గ్రామసభలో తెలియజేయాలని ఎంపీడీఓ కోరారు.

గ్రామసభల అనంతరం విచారణ బృందం మరియు గ్రామసభలో వచ్చిన సవరణలను తాజా ఓటర్ల జాబితాలో నమోదు చేసి, 07/09/2026న ఫారం-×× ద్వారా తుది ప్రచురణ చేయనున్నారు. తుది ప్రచురణ అనంతరం ూజ/ూు/దీజగా గుర్తించబడిన ఓటర్ల జాబితాలో ఎటువంటి మార్పులు/సవరణలు చేయబడవని జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలలో పేర్కొన్నారు.

# వేమిరెడ్డి క్రేజ్ చూసి జగన్‌లో దడ.. అందుకే అనిల్‌తో బురదజల్లుడు రాజకీయం

-- పాత చింతకాయ పచ్చడినే మళ్లీ మళ్లీ రుబ్బుతున్న మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్..
-- నెల్లూరులో ఎన్డీయే 10/10 గెలుపు, సర్వే ఫలితాలు చూసి జగన్‌లో మొదలైన భయం.
-- సొంత జిల్లాలో వేలాది ఉపాధికి గండికొట్టి, నాసిరకం క్వార్జ్‌తో చైనాలో రాష్ట్రాన్ని బ్లాక్ లిస్టులో పెట్టిన ఘనత అనిల్‌దే
-- కరోనా కష్టకాలంలోనూ బెడ్లు, ఇంజెక్షన్లు, తిండి అమ్ముకుని వందల కోట్లు దోచుకున్నారు.
-- ఆధారాలతో సహా అనిల్ 15 పుస్తకాల అవినీతి బయటపెడతాం: తెదేపా నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి తీవ్ర ఆగ్రహం.

నెల్లూరు (ఇదినిజం ప్రతినిధి ): నెల్లూరు పార్లమెంటు సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతుల ప్రజాదరణను చూసి మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి భయపడుతున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీ కేతంరెడ్డి వినోద్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇటీవల విలేకరుల సమావేశాల్లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పై మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం నెల్లూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వినోద్ గారు మాట్లాడారు.

**కూటమి విజయం, సర్వే ఫలితాలు చూసి జగన్‌లో భయం**

కేతంరెడ్డి వినోద్ రెడ్డి మాట్లాడుతూ, వేమిరెడ్డి దంపతుల ప్రజాసేవ వల్ల తెలుగుదేశం పార్టీ ప్రజల్లోకి బలంగా వెళ్తోందన్నారు. గత ఎన్నికల్లో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎంపీగా పోటీ చేసి 2.50 లక్షల పైచిలుకు భారీ మెజారిటీ సాధించడంతో నెల్లూరు జిల్లాలో ఎన్డీయే కూటమి 10కి 10 నియోజకవర్గాలు గెలుచుకుందని గుర్తుచేశారు. ఇటీవల వైసీపీ నిర్వహించిన అంతర్గత సర్వేల్లో కూడా జిల్లాలో మళ్లీ కూటమి ప్రభంజనమే రిపీట్ అవుతుందని, వేమిరెడ్డి భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని తేలడంతో జగన్‌మోహన్ రెడ్డికి వణుకు మొదలైందన్నారు. ఈ సమయంలో రాజకీయంగా ఖాళీగా ఉన్న అనిల్ కుమార్ యాదవ్, క్వార్జ్ మైనింగ్‌పై పాత డేటాను పట్టుకుని జగన్ దగ్గరకు వెళ్లగా, అదేదో నిజమని నమ్మి విలేకరుల సమావేశాలు పెట్టమని జగనే పంపారని తెలిపారు. దీంతో అనిల్ పాత చింతకాయ పచ్చడినే మళ్లీ మళ్లీ రుబ్బుతూ తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

**ఉపాధికి గండికొట్టి రాష్ట్రాన్ని బ్లాక్ లిస్టులో పెట్టిన ఘనత అనిల్‌దే**

గతంలోనే వైసీపీ నాయకులు వేమిరెడ్డి గారిపై అనవసర అభియోగాలు మోపడం వల్ల, ఆయన పారిశ్రామికంగా కంపెనీ పెట్టే ఆలోచనను పక్కన పెట్టేశారని తెలిపారు. ఆయన ఆ కంపెనీ పెట్టి ఉంటే నెల్లూరు జిల్లాలో వేలాది మందికి ఉపాధి లభించేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో క్వార్జ్ అక్రమాలకు పెద మేస్త్రీలా వ్యవహరించింది అనిల్ కుమార్ యాదవేనని నిలదీశారు. అనిల్ పంపిన నాసిరకం, లో-గ్రేడ్ క్వార్జ్ సరకు వల్ల చైనాలో మన జిల్లాతో పాటు రాష్ట్రాన్ని కూడా బ్లాక్ లిస్టులో పెట్టారని, దానివల్ల ఎన్నో కంపెనీలు




మూతపడ్డాయని ఆరోపించారు.

**స్థాయి తెలుసుకుని విలేకరుల సమావేశాలు పెట్టు**

అనిల్ తన స్థాయి తెలుసుకుని మాట్లాడాలని వినోద్ హెచ్చరించారు. ప్రపంచ దేశాలు తిరిగే ఇంటర్నేషనల్ ప్రొఫైల్ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారిదని, ఫత్తేఖాన్ పేటలోని కూల్‌డ్రింక్ షాప్‌లో కూర్చుని గోళ్లు గిల్లుకునే అనిల్ బ్యాచ్ లాంటి వారు కాదని స్పష్టం చేశారు. ఆరోపణలు స్వార్థంతో కాదని, రాజకీయాలు పక్కన పెట్టి జిల్లా వ్యాప్తంగా లక్షల మందికి ఉచిత కంటి పరీక్షలు, విద్య, వైద్యం, దైవ కార్యక్రమాలు చేస్తూ రూపాయి ఆశించకుండా సేవా కార్యక్రమాలు అందిస్తున్న మహోన్నత వ్యక్తి వేమిరెడ్డి గారని కొనియాడారు. నెల్లూరులో ఎంతమంది ధనవంతులున్నా ఎవరికీ రాని సేవ గుణం వీపీఆర్ సొంతమని అన్నారు.

**అనిల్ అవినీతిపై సమగ్ర విచారణ**

గతంలో మంత్రిగా అనిల్ కుమార్ యాదవ్ చేసిన అపారమైన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి నిజాలు బయటపెట్టాలని కూటమి ప్రభుత్వాన్ని, జిల్లా మంత్రులను, ఎంపీ గారిని కోరుతున్నట్లు వినోద్ రెడ్డి తెలిపారు. అయితే అనిల్‌ను మాత్రం అరెస్టు చేసి జైల్లో పెట్టవద్దని ఎద్దేవా చేశారు. వైసీపీలో జైలుకెళ్లిన వారికే ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తారని ఆశతో అనిల్ 'నన్ను జైల్లో పెట్టండి' అని నాటకాలాడుతున్నారని ఎద్దేవా చేశారు.

**కరోనా శవాలపైనా డబ్బులు సంపాదించిన చరిత్ర**

కరోనా కష్టకాలంలో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ప్రజలు అల్లాడుతుంటే, అనిల్ తన తమ్ముడిని అడ్డుపెట్టుకుని వందల కోట్లు దోచుకున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. పెద్దాస్పత్రిలో బెడ్‌లు, రెమ్‌డెసివిర్ ఇంజెక్షన్లు, చివరికి బాధితులకు ఇచ్చే తిండిని కూడా అమ్ముకుని తిన్న వ్యక్తి అనిల్ అని మండిపడ్డారు. నెల్లూరు ప్రజల శాపాలు తగిలే నెల్లూరులో తంతే పల్నాడులో, పల్నాడులో తంతే చెన్నైలో పడ్డాడని విమర్శించారు. ఇప్పుడు నెల్లూరులో ఎంట్రీ లేక, వైసీపీలో ఎమ్మెల్యే టిక్కెట్ దక్కక, రాబోయే మేయర్ ఎన్నికల్లో సీటు సాధించడానికే జగన్ మెప్పు కోసం వేమిరెడ్డి గారిపై బురద జల్లుతున్నారని ధ్వజమెత్తారు.

**అవినీతి చిట్టా 15 పుస్తకాలు**

నుడా (చీఖణా) లో నెలకు రూ.5 కోట్ల చొప్పున కమిషన్లు మింగారని, బిల్డింగ్ పర్మిషన్లు, లేఅవుట్లలో దోచుకున్నారని ఆరోపించారు. ఇరిగేషన్ శాఖలో వందల కోట్ల అవినీతికి పాల్పడ్డారని, నెల్లూరు రిటైనింగ్ వాల్ నిర్మాణంలో రూ.100 కోట్ల అవినీతిపై ఇప్పటికీ కోర్టులో కేసు నడుస్తోందన్నారు. ఇక కాలువల తవ్వకాలు, ఇసుకను అక్రమంగా చెన్నైకి తరలించి సంపాదించిన అక్రమార్జనపై ప్రింట్ వేస్తే 15 పుస్తకాల చిట్టా అవుతుందని చెప్పారు.

**నల్లపురెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డిపై తీవ్ర ఆగ్రహం**

కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి తీరును కూడా కేతంరెడ్డి వినోద్ రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు. వేమిరెడ్డి గారి తరఫున మాట్లాడే వారిని విమర్శిస్తున్న ప్రసన్న, అసలు అనిల్ వెనుక ఉండి ఎందుకు వత్తాసు పలుకుతున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రసన్న, అనిల్ ఇద్దరికీ జిల్లాలో టిక్కెట్లు లేవని, ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. 'ఏనుగు వెళుతుంటే కుక్కలు మొరగడం సహజం.. అవి వేమిరెడ్డి గారి ఇమేజ్‌ను ఏమీ చేయలేవు' అని స్పష్టం చేశారు.

## సెలవు రోజుల్లోనూ ఎస్ఐఆర్ వెరిఫికేషన్





సీతారామపురం (ఇది నిజం ప్రతినిధి) సీతారామపురం మండలంలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం, ఆదివారం సెలవు రోజుల్లోనూ నోటీసులపై వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షేక్. ఫజిహా, ఎంపీడీవో జె. చిన్న చెన్నారావు తెలిపారు.జిల్లా కలెక్టర్, డిప్యూటీ సీఈఓ ఆదేశాల మేరకు ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో విచారణ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. బీఎల్వోలు ప్రజలకు సమాచారం అందించి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

## ఏ.ఎస్.పేట లో ఘనంగా దివంగత ముఖ్యమంత్రి,మహానేత,,కీర్తిశేషులు,స్వర్గీయ డాక్టర్.వైఎస్.రాజశేఖర్ రెడ్డి గారి 17 వ వర్ధంతి వేడుకలు





ఏఎస్పేట (ఇది నిజం ప్రతినిధి హరికృష్ణ) ఏఎస్పేట మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ నందు బుధవారం దివంగత ముఖ్యమంత్రి వరులు డాక్టర్ వైయస్.రాజశేఖర్ రెడ్డి గారి వర్ధంతి వేడుకలను ఆత్మకూరు నియోజకవర్గ గౌరవ శాసనసభ్యులు,గౌరవనీయులు,పెద్దలు శ్రీ.మేకపాటి.విక్రమ్ రెడ్డి గారి ఆదేశముల మేరకు ఏ.ఎస్. పేట మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ శ్రీ.పందిళ్ళపల్లి సుబ్బారెడ్డి గారు మరియు్జూజ సభ్యురాలు శ్రీమతి.పందిళ్ళపల్లి.రాజేశ్వరమ్మ గారి సూచనల మేరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పులిమి.వెంకట రమేష్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు,ముందుగా వైయస్.రాజశేఖర్ రెడ్డి గారి విగ్రహమునకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించినారు,,తదుపరి వైఎస్ఆర్ గారి చిత్రపటమునకు పూలమాలతో అలంకరించి,పూలు వేసి ఘన నివాళులు అర్పించినారు,ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి గారు ఈ రాష్ట్రానికి చేసిన సేవలను గుర్తు చేసుకుని కొనియాడారు,ఈ సందర్భంగా జోహార్ వైఎస్ఆర్,అమర్ రహే వైఎస్ఆర్ అని నినదించినారు,,పై కార్యక్రమంలో ఏ.ఎస్. పేట మండల అధ్యక్షురాలు బోయళ్ల.పద్మజా రెడ్డి సీనియర్ నాయకులు అంబవరపు.కోటి రెడ్డి మరియు అన్ని గ్రామాల నాయకులు,కార్యకర్తలు,అభిమానులు ప్రజా ప్రతినిధులు ఏఎస్పేట గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డి ఎం హెచ్ ఓ డాక్టర్ తుకారం రాథోడ్..





భద్రాచలం సెప్టెంబర్ 2 (ఇదినిజం ప్రతినిధి ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (ఐవీనూ) డాక్టర్ తుకారామ్ రాథోడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏటపాక మండలం, గొస్సగుప్ప గ్రామంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల వసతి గృహానికి చెందిన విద్యార్థులకు సంబంధించిన ఘటన నేపథ్యంలో భద్రాచలం ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.వసతి గృహంలో జ్వర కేసులు నమోదైన నేపథ్యంలో, మలేరియా నివారణ చర్యల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ వైద్య శిబిర సిబ్బంది క్లోరోక్విన్ మాత్రలు అందించారు. అనంతరం మొత్తం 52 మంది వసతి గృహ విద్యార్థులను భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు.ఈ 52 మంది విద్యార్థుల్లో 9 మందికి మాత్రలు తీసుకున్న అనంతరం దుష్ప్రభావాలు మరియు ఆందోళన లక్షణాలు కనిపించాయి. జమున అనే విద్యార్థినిని ఆసుపత్రికి తీసుకురాగానే మృతిచెందిన స్థితిలో ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. మిగిలిన విద్యార్థులను ఆసుపత్రి వైద్య బృందం పరీక్షించి, చికిత్స అందిస్తూ పర్యవేక్షిస్తోంది. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. అనంతరం ఐవీనూ, ప్రయోగశాల సాంకేతిక నిపుణులు, వీఎచ్ఔలు/మీలు సూపర్‌వైజర్లు (రాఖూం)తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పర్యవేక్షణ మరియు నిర్వహణపై చర్చించారు. =ఋ పరీక్షల్లో మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణైన కేసులకు తప్పనిసరిగా రక్తపు స్మియర్ (దీూ) నమూనాలు సేకరించి, నిబంధనల ప్రకారం జిల్లా రాష్ట్ర స్థాయి ప్రయోగశాలల్లో క్రాస్ వెరిఫికేషన్ కోసం పంపాలని సిబ్బందిని ఆదేశించారు. పోషకాహార వారోత్సవాల రెండో రోజు సందర్భంగా ఐవీనూ సమతుల్యమైన పోషక విలువలతో కూడిన ఆహారం ప్రాముఖ్యతను వివరించారు. అవసరమైన పోషకాలు తగిన మోతాదులో తీసుకోవాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అలాగే, ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహిస్తున్న నేత్రదాన పక్షోత్సవ కార్యక్రమాలపై కూడా సమీక్ష నిర్వహించారు. నేత్రదానం ప్రాముఖ్యత, దాని ద్వారా చూపు పునరుద్ధరణకు కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.పై ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, సమాజంలో క్రమం తప్పకుండా ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఐవీనూ అన్ని శాఖల సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ తోపాటు అడిషనల్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి (గిరిజన) డాక్టర్ సైదులు, ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీధర్ భద్రాచలం వారు పాల్గొని సమీక్షా చెయ్యడం జరిగింది. ఇందులో జిల్లా ల్యాబ్ టెక్నీషియన్లు సబ్ యూనిట్ అధికారులు ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇదినిజం
RNI Regd.No: APTEL/2012/45871
సాయంకాలం దినపత్రిక



## ఫుడ్ పాయిజన్‌తో ఆసుపత్రిలో చేరిన చిన్నారులను పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ...







భద్రాచలం, సెప్టెంబర్ 2 (ఇదినిజం ప్రతినిధి ):భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎటపాక మండలం గొల్లగుప్ప గ్రామానికి చెందిన కొంతమంది చిన్నారులు ఫుడ్ పాయిజన్ కారణంగా భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని, వారిని పరామర్శించారు.చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు , వారికి అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. చిన్నారులకు మెరుగైన వైద్యం, అవసరమైన అన్ని వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.చిన్నారుల కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, పార్టీ నాయకులు భోగాల శ్రీనివాస్ రెడ్డి, రత్నం రమాకాంత్, చింతీరాల రవి కుమార్, నర్రా రాము, భీమవరపు వెంకటరెడ్డి, చింతాడి చిట్టిబాబు, పెద్దినేని శ్రీనివాస్, యండి జిందా, చాట్ల రవి, రసమళ్ల రాము, బషీర్, యూత్ నాయకులు గాడి విజయ్, మాచినేని భాను తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లో మత ప్రచారాలు చేపిస్తారా: ఎమ్మెల్సీ ఆగ్రహం



పటాన్ చెరువు సెప్టెంబర్ 2 (ఇదినిజం ప్రతినిధి ): ప్రభుత్వ బడుల్లో మతప్రచారాలు ఎలా ప్రోత్సహిస్తారు అని, విద్యార్థినూల పుస్తకాలతో పాటు ఇతర మతాలకు చెందిన పుస్తకాలు పాఠశాలలోకి ఎలా అనుమతిస్తారని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు! చిట్కుల్ బాలికల సాంఘిక సంక్షేమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యా, బోధన తీరు మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులతో కలిసి వాళ్ళ బాగోగుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు అండూర్ నర్సింగ్ రావు, కావలి వీరేష్, రాజశేఖర్ రెడ్డి, కావలి ఐలేష్, నరేష్ కుమార్ యాదవ్, ప్రవీణ్ కుమార్ యాదవ్,సందీప్ గౌడ్ తదిరులు నాయకులు పాల్గొన్నారు.

## కారేపల్లి లో ఘనంగా ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ

**స్వతంత్రం రాకముందు నుంచే ఆనవాయితీగా అమ్మవారికి బోనాల సమర్పణం.**



కారేపల్లి, సెప్టెంబర్ 2: (ఇదినిజం ప్రతినిధి ): కారేపల్లి గ్రామంలో మంగమ్మ గడ్డ నందు ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గాదె సుబ్బయ్య, కేశగాని బాలకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను అలంకరించి ఊరేగింపుగా తీసుకువచ్చి ముత్యాలమ్మ తల్లికి సమర్పించారు.స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే కారేపల్లి గ్రామంలో ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించే ఆనవాయితీ కొనసాగుతోందని గ్రామ కుల పెద్ద ఆదేర్ల అంజయ్య తెలిపారు. ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అమ్మవారి కృపతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రత్యేకంగా ప్రార్థించారు. బోనాల పండుగ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. నిర్వాహకులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

## అశ్వారావుపేట అగ్రికల్చర్ కాలేజీలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

**--- అపరిచిత లింకులు, నకిలీ కాల్స్‌తో జాగ్రత్త: పాల్వంచ డిఎస్పీ ఆర్. సతీష్ కుమార్**




అశ్వారావుపేట సెప్టెంబర్ 2 (ఇదినిజం ప్రతినిధి ): సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచికి ఉపయోగించాల్సిన యువత, సైబర్ నేరగాళ్ల మాయమాటల వలలో పడి మోసపోవద్దని పాల్వంచ డిఎస్పీ ఆర్. సతీష్ కుమార్ పిలుపునిచ్చారు.
అశ్వారావుపేట మండల కేంద్రంలోని వ్యవసాయ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన సదస్సు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిఎస్పీ సతీష్ కుమార్, నేటి డిజిటల్




యుగంలో జరుగుతున్న వివిధ రకాల సైబర్ మోసాలు మరియు వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సైబర్ నేరగాళ్లు అమాయకులే లక్ష్యంగా రోజుకో కొత్త పంథాలో మోసాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా చదువుకున్న యువత, విద్యార్థులు క్రింది అంశాల పట్ల ఎంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు: డిజిటల్ అరెస్ట్ భయాలు వద్దు, సీబీఐ, ఈడీ, పోలీస్ అధికారులమని చెప్పి వీడియో కాల్స్ చేసి భయపెట్టడం పూర్తిగా మోసమని, చట్టంలో "డిజిటల్ అరెస్ట్" అనేదే లేదని తెరిచి చెప్పారు. నకిలీ పార్ట్ టైమ్ జాబ్స్: టెలిగ్రామ్, వాట్సాప్‌లలో వచ్చే 'వర్క్ ఫ్రమ్ హోమ్' మెసేజ్‌లను నమ్మి ప్రారంభంలో వచ్చే చిన్న చిన్న లాభాలకు ఆశపడి పెద్ద మొత్తంలో డబ్బులు పోగొట్టుకోవద్దని హెచ్చరించారు. ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్స్, తక్కువ పెట్టుబడికి అధిక లాభాలు వస్తాయని చెప్పే నకిలీ ట్రేడింగ్ యాప్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ముఖ్యమైన సూచనలు, అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదని, ఒటిపి (ఊా), బ్యాంక్ వివరాలు, ఆధార్ సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ లోన్ యాప్‌లు, ఫ్రాడ్‌లు మరియు సోషల్ మీడియా బ్లాక్‌మెయిలింగ్ పట్ల సదా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్, అశ్వారావుపేట సీఐ పి. నాగరాజు, ఎస్సైలు టి. యయాతి రాజు, దేవ్ సింగ్‌లతో పాటు సుమారు 200 మంది విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపక బృందం ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ప్రభుత్వ,ప్రైవేటు ఉపాధ్యాయులకు ధ్యాన శిక్షణ


**ఉపాధ్యాయుల్లో మానసిక ప్రశాంతత,ఏకాగ్రత పెంపొందించడమే లక్ష్యం**



కారేపల్లి సెప్టెంబర్ 2 (ఇదినిజం ప్రతినిధి ):ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రత్యేక ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని గురువారం మధ్యాహ్నం 2 గంటలకు కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈఓ దుగ్గిరాల జయరాజు,కారేపల్లి పిరమిడ్ సేవాదళ్ అధ్యక్షురాలు ముక్కా స్వరాజ్యలక్ష్మి తెలిపారు.బ్రహ్మశ్రీ పితామహ పత్రీజీ స్ఫూర్తితో కారేపల్లి పిరమిడ్ సేవాదళ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఉపాధ్యాయులు నిత్యం విద్యార్థుల బోధనతో పాటు అనేక బాధ్యతలు నిర్వర్తిస్తున్న నేపథ్యంలో మానసిక ప్రశాంతత,ఏకాగ్రత,సానుకూల ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవడంలో ధ్యానం దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.ఉద్యోగ,కుటుంబ బాధ్యతలతో ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించుకోవడంతో పాటు బోధనలో మరింత ఏకాగ్రత సాధించేందుకు ధ్యానం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.విద్యార్థులకు ఎలా నేర్పాలో ఉపాధ్యాయులకు శిక్షణ ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వయంగా ధ్యానం చేయడం నేర్చుకోవడంతో పాటు పాఠశాలల్లో విద్యార్థులకు ధ్యానాన్ని ఏ విధంగా పరిచయం చేయాలి,పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా ఎలా బోధించాలి,వారిలో ఏకాగ్రత,ప్రశాంతత,క్రమశిక్షణ,సానుకూల ఆలోచనలు పెంపొందించేలా ధ్యాన సాధనను ఎలా అలవాటు చేయాలి అనే అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.శిక్షణ పొందిన ఉపాధ్యాయులు అనంతరం తమ పాఠశాలల్లో విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించి,ధ్యాన సాధన పద్ధతులను నేర్పేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు.తద్వారా ఉపాధ్యాయులకే కాకుండా విద్యార్థులకు కూడా ధ్యానం ప్రయోజనాలు చేరవేయడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు.చదువుపై ఏకాగ్రత పెంపొందించుకోవడం,ప్రశాంతంగా ఆలోచించడం,ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడం వంటి అంశాలపై విద్యార్థులకు ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేసే విధానాన్ని శిక్షణలో వివరించనున్నట్లు తెలిపారు.ఈ ధ్యాన శిక్షణ కార్యక్రమానికి పిరమిడ్ సేవాదళ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ పరమేశ్వర్ రెడ్డి,పీఎంసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద్ బుద్ధ, భూపతిరాజు హనుమంతరావు,రమేష్ తదితరులు హాజరై ధ్యానం ప్రాధాన్యత,ఆచరణ విధానం,విద్యార్థులకు ధ్యానాన్ని బోధించే పద్ధతులపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.కారేపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గురువారం మధ్యాహ్నం 2 గంటలకు కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించే ధ్యాన శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలని ఎంఈఓ దుగ్గిరాల జయరాజు,కారేపల్లి పిరమిడ్ సేవాదళ్ అధ్యక్షురాలు ముక్కా స్వరాజ్యలక్ష్మి కోరారు.

## వైఎస్సార్ సంక్షేమ పాలన తెలుగు రాష్ట్రాల చరిత్రలో స్వర్ణయుగం

**మాజీ సీఎం డా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా మంత్రి సీతక్క నివాళులు**



ములుగు, సెప్టెంబర్ 2 (ఇదినిజం ప్రతినిధి ): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలన తెలుగు రాష్ట్రాల చరిత్రలో 'సంక్షేమ స్వర్ణయుగం'గా నిలిచిపోయిందన్నారు. 2004 నుంచి 2009 వరకు ఆయన సాగించిన సంక్షేమ పాలనలో పేదరిక నిర్మూలనే ప్రధాన ధ్యేయంగా అనేక విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టి కోట్లాది మంది జీవితాల్లో మార్పు తీసుకొచ్చారని పేర్కొన్నారు.వైఎస్సార్ హయాంలో ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, 104 అత్యవసర సేవలు, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు పావలా వడ్డీ రుణాలు, రెండు రూపాయలకే కిలో బియ్యం, వృద్ధాప్య పింఛన్లు తదితర అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని మంత్రి సీతక్క అన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భౌతికంగా దూరమైనప్పటికీ ఆయన ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్ వంటి పథకాలు నేటికీ తెలుగు ప్రజల జీవితాల్లో కొనసాగుతున్నాయని, ఆయన సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పిస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు.ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, పంచాయతీరాజ్ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు, జిల్లా సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, చైర్మన్లు, డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పరికిణీలో పాల మీగడ లాంటి మేనిఛాయతో ఆకట్టుకుంటున్న కయాదూ లోహర్!

ఇటీవల కాలంలో హీరోయిన్లు ఒకవైపు గ్లామర్ తో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ.. సోషల్ మీడియాలో ఫాలోవర్స్ ను పెంచుకుంటూనే.. మరొకవైపు తమ సినిమా ప్రమోషన్స్ కూడా ఇదే ఇన్స్టాగ్రామ్ ద్వారా చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల కాలంలో హీరోయిన్లు ఒకవైపు గ్లామర్ తో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ.. సోషల్ మీడియాలో ఫాలోవర్స్ ను పెంచుకుంటూనే.. మరొకవైపు తమ సినిమా ప్రమోషన్స్ కూడా ఇదే ఇన్స్టాగ్రామ్ ద్వారా చేస్తున్న విషయం తెలిసిందే. ఒకవైపు ఇంటర్వ్యూలో పాల్గొంటూ.. మరొకవైపు ఇలా గ్లామర్ తో కూడా ప్రమోషన్స్ చేస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నారు.. అలాంటి వారిలో కయాదు లోహర్ కూడా ఒకరు. అందులో భాగంగానే ఇన్స్టాగ్రామ్ వేదికగా గత కొన్ని రోజులుగా వరుస గ్లామర్ ఫోటోలు షేర్ చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈమె.. నేడు సాంప్రదాయంగా లంగా వోణీలో కనిపించి అభిమానులను ఆకట్టుకుంది. గోల్డెన్ కలర్ తో డిజైన్ చేసిన ఈ లంగా వోణీలో అమ్మడి అందం రెట్టింపు అవుతోందని చెప్పవచ్చు. జడ దువ్వుకొని కింద రిబ్బన్ కట్టుకొని చాలా అందంగా కనిపించింది కయాదు లోహర్. పాలమీగడ లాంటి మేని ఛాయతో మైమరిపింప చేసింది. ముఖ్యంగా ఒకవైపు ఈమె నటిస్తున్న ది ప్యారడైజ్ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఇలా అందంగా తయారయింది అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. కానీ అసలు విషయం వేరే: మైత్రీ రవి నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న చిత్రం ది ప్యారడైజ్. ఇదివరకే వీరి కాంబినేషన్లో దసరా సినిమా వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇక అందుకే మళ్ళీ వీరిద్దరి కాంబినేషన్లో సినిమా ప్రకటించడంతో అంచనాలు భారీగా పెరిగిపోయాయి. దీనికి తోడు వీరిద్దరి కాంబినేషన్లో వస్తున్న ది ప్యారడైజ్ మూవీ నుండి విడుదల చేసిన ప్రతి అప్డేట్ కూడా సోషల్ మీడియాలో వైరల్ గా మారుతుంది. పైగా సినిమా నుండి విడుదల చేసిన పాటలు కూడా యూట్యూబ్లో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. అలాంటి చిత్రంలో కయాదు లోహర్ హీరోయిన్గా అవకాశం అందుకుంది.ఈ చిత్రం సెప్టెంబర్ 24వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతోంది . సోనాలి కులకర్ణి, మోహన్ బాబు, రాఘవ్ జుయల్ , సంపూర్ణేష్ బాబు , తనికెళ్ల భరణి తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. పైగా ఈ సినిమాతో కయాదు లోహర్ మంచి విజయాన్ని అందుకోవాలని ఆశలు పెట్టుకుంది.. మరి ఆమెకు ఈ సినిమా ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి. కయాదు లోహర్ తదుపరి చిత్రాల విషయానికి వస్తే.. ఇటీవలే దుల్కర్ సల్మాన్తో కలిసి ఐయామ్ గేమ్ అనే చిత్రంలో నటించింది. సూర్య 48వ చిత్రంలో కూడా ఈమె హీరోయిన్గా నటిస్తోంది. హోం భలే ఫిలిమ్స్ బ్యానర్ పై టీజే జ్ఞానవేల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. జీవి ప్రకాష్ కుమార్ హీరోగా వచ్చిన ఇమ్మోర్టల్ చిత్రంలో కూడా ఈమె హీరోయిన్గా నటించింది . ఇక అంతే కాదు మలయాళ చిత్రంతో పాటు మరో తమిళ చిత్రంలో హీరోయిన్గా అవకాశం అందుకుంది. నిజానికి ఇటీవల కాలంలో వరుస ఫ్లాప్ లు లభిస్తున్నప్పటికీ ఈమెకు హీరోయిన్గా వరుస అవకాశాలు లభిస్తూ ఉండడం గమనార్హం.





## యశ్.. పట్టుకునే డైరెక్టర్ ఎవరు?



పెద్ద స్టార్ హీరోల దగ్గర ఒక సినిమా పూర్తయ్యేలోపే తర్వాతి రెండు సినిమాలు లైన్లో ఉంటున్నాయి. కానీ యశ్ విషయంలో ఇప్పుడు పరిస్థితి కొంచెం వేరు. పెద్ద స్టార్ హీరోల దగ్గర ఒక సినిమా పూర్తయ్యేలోపే తర్వాతి రెండు సినిమాలు లైన్లో ఉంటున్నాయి. కానీ యశ్ విషయంలో ఇప్పుడు పరిస్థితి కొంచెం వేరు. 'టాక్సిక్' ఆగస్టు 26న థియేటర్లలోకి వచ్చింది. నితేశ్ తివారీ 'రామాయణ'లో రావణుడిగా యశ్కు ఇంకా పని ఉంది. అయితే అది యశ్ సోలో హీరోగా చేసే సినిమా కాదు. 'టాక్సిక్' తర్వాత సోలో హీరో ప్రాజెక్ట్ ఏంటన్నది మాత్రం ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించలేదు. 00:00 / 02:25 యశ్ ఇలా టైమ్ తీసుకోవడం కొత్తేమీ కాదు. 'కేజీఎఫ్ 2' 2022లో వచ్చిన తర్వాత వెంటనే మరో సినిమా ఒప్పుకోలేదు. చాలా గ్యాప్ తీసుకుని గీతూ మోహన్దాస్తో 'టాక్సిక్' చేశాడు. అప్పట్లో కూడా పెద్ద కమర్షియల్ దర్శకుడిని ఎంచుకుంటాడని అనుకున్నారు. కానీ యశ్ మాత్రం వేరే ఛాయిస్ తీసుకున్నాడు. ఇప్పుడు మరోసారి అలాంటి గ్యాప్ వచ్చింది. మార్కెట్ ఉన్న హీరో రెడీగా ఉన్నా, అతనికి నచ్చే కథ ఎవరి దగ్గర ఉందన్నదే ప్రశ్న. మైత్రీ రవి ఈ మధ్య హేమంత్ ఎం.రావు పేరు యశ్తో గట్టిగానే వినిపించింది. 'సప్త సాగరదాచే ఎల్లో'తో గుర్తింపు తెచ్చుకున్న హేమంత్ దర్శకత్వంలో యశ్ సినిమా అంటూ టాక్ వచ్చింది. కానీ యశ్ టీమ్ నుంచి గానీ, హేమంత్ నుంచి గానీ సినిమా అనౌన్స్ కాలేదు. హేమంత్ ఇటీవల 'టాక్సిక్'పై పోస్ట్ చేయడంతో ఆ టాక్ మళ్లీ బయటకు వచ్చింది. తెలుగు దర్శకులకు కూడా యశ్ ఇప్పుడు మంచి ఆప్షనే. ప్రభాస్, ఎన్టీఆర్, రామ్ చరణ్, అల్లు అర్జున్, మహేష్ లాంటి హీరోల చేతుల్లో ఇప్పటికే పెద్ద సినిమాలు ఉన్నాయి. వాళ్ల డేట్స్ కోసం దర్శకులు సంవత్సరాల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉంది. యశ్ మాత్రం తన తర్వాతి సోలో సినిమాను ఇంకా ప్రకటించలేదు. పాన్ ఇండియా మార్కెట్ ఉన్న హీరో కావడంతో తెలుగు నుంచి కూడా కథలు వెళ్లే అవకాశం లేకపోలేదు. అయితే యశ్ను ఒప్పించడం అంత ఈజీ కాదని 'టాక్సిక్'తోనే మరోసారి తెలిసింది. 'కేజీఎఫ్' తర్వాత అందరూ ఊహించిన దారిలో కాకుండా గీతూ మోహన్దాస్ను ఎంచుకున్నాడు. హైదరాబాద్ ఈవెంట్లో దిల్ రాజు కూడా అప్పట్లో ఆ కాంబో తనను ఆశ్చర్యపరిచిందని చెప్పారు. అంటే దర్శకుడి గత బాక్సాఫీస్ రికార్డు చూసి ఒప్పుకునే రకం కాదని అర్థమవుతుంది. ఇక యశ్ నెక్ట్స్'రామాయణ' పని పూర్తి చేయాల్సి ఉంది. పార్ట్ 2 కోసం రణబీర్ కపూర్తో యశ్ కీలక సన్నివేశాలు ఇంకా షూట్ చేయాల్సి ఉందట. ఆ ప్రాజెక్టు మధ్యలోనే కొత్త సినిమా ప్రకటిస్తాడా, లేక ఆ పని పూర్తయ్యాకే నిర్ణయం తీసుకుంటాడా అన్నది చూడాలి.

## పవన్ బర్త్ డే: అన్నా కొణిదెల పోస్ట్‌కు అభిమానుల నీరాజనం

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు (2 సెప్టెంబర్) సందర్భంగా సోషల్ మీడియా వేదికగా అభిమానుల నుండి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన భార్య అన్నా కొణిదెల తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ.. షేర్ చేసిన ఒక ఎమోషనల్ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. –పవర్ స్టార్ ఎంతోమంది జీవితాలను తన ఆత్మీయ స్పర్శతో తాకారని.. ఎందరో ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారంటూ అన్నా లెజినోవా చేసిన పోస్ట్‌కు లక్షలాది మంది నెటిజనులు ప్రతిస్పందిస్తున్నారు. ముఖ్యంగా ఆలు మగలు ఇలా ఆహ్లాదంగా ఆదర్శవంతంగా ఉన్న ఫోటోగ్రాఫ్ ని షేర్ చేయగా దానికి లవ్, హార్ట్ ఈమోజీలతో అభిమానులు ప్రేమను కురిపిస్తున్నారు. ముఖ్యంగా అన్నా షేర్ చేసిన ఫోటోగ్రాఫ్ లో పవన్ తెల్ల కుర్తాలో ఎంతో సింపుల్ గా కనిపించడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఒక డంబోకైనా అర్థం కావాలి సినిమా రంగంలో పవర్ స్టార్‌గా



కోట్లాదిమంది అభిమానాన్ని గెలుచుకున్న పవన్ కళ్యాణ్.. రాజకీయాల్లోకి వచ్చి ప్రజా నాయకుడిగా మారిన తీరును అభిమానులు ఎంతో గర్వంగా స్మరించుకుంటున్నారు. నెటిజన్లు కామెంట్లలో ఆయనను కేవలం ఒక నటుడిగానే కాకుండా తమకు మార్గదర్శిగా, ఒక భావోద్వేగంగా అభివర్ణిస్తున్నారు. --సినిమాతో పరిచయమై... రాజకీయంలో మార్గదర్శకుడివి అయ్యావు-- అంటూ కామెంట్ల రూపంలో తమ గుండెల్లోని అభిమానాన్ని చాటుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా విదేశాల నుంచి కూడా పవన్ కళ్యాణ్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. కామెంట్లలో ఒక అభిమాని స్పందిస్తూ... పవన్ కళ్యాణ్ జీవితంలో అన్నా కొణిదెల తోడుగా నిలవడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఒక గొప్ప ఆశాకిరణంగా నిలిచే నాయకుడికి జీవిత భాగస్వామిగా సరైన మద్దతు ఇస్తున్నారని కొనియాడారు. భాషలు, ప్రాంతాల సరిహద్దులు దాటి పవన్ కళ్యాణ్‌కు ఉన్న ప్రజాదరణకు ఈ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి. కేవలం శుభాకాంక్షలతోనే ఆగిపోకుండా.. పవన్ కళ్యాణ్ ప్రజా సేవకుడు కావడంతో కొందరు తమ సమస్యలను, విజ్ఞప్తులను కూడా ఈ పోస్ట్ ద్వారా పవన్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. అరుదైన డిఎండి వ్యాధితో బాధపడుతున్న తన కుమారుడి వైద్యం కోసం సహాయం చేయాలని ఒక తండ్రి చేసిన విజ్ఞప్తి అందరినీ కలచివేస్తోంది. పవన్ కళ్యాణ్ ఉదార హృదయంతో స్పందిస్తారనే నమ్మకంతోనే అభిమానులు ఇటువంటి అత్యవసర సాయం కోసం ఆయనను ఆశ్రయిస్తున్నారు. మొత్తానికి అన్నా కొణిదెల చేసిన ఈ ఒకే ఒక్క పోస్ట్ పవన్ కళ్యాణ్‌పై ఉన్న అపారమైన అభిమానాన్ని, నమ్మకాన్ని మరోసారి స్పష్టం చేసింది. అభిమానులు ఆయనను –అన్నయ్య–, –జనసేనాని–, –పిఠాపురం ఎమ్మెల్యే–, –ఉపముఖ్యమంత్రి– అని పిలుస్తూ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని దేవుడిని ప్రార్థిస్తున్నారు. ఈ జన్మదిన వేడుకలు కేవలం ఒక నటుడి పుట్టినరోజుగా మాత్రమే కాకుండా.. ఒక ప్రజా నాయకుడికి ప్రజలు అందిస్తున్న ఘన నీరాజనంగా నిలిచాయి.

## పవన్ బర్త్డే ట్రీట్.. కేవలం అదొక్కటేనా?



ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఈ స్పెషల్ డే పవన్ నుంచి క్రేజీ అప్డేట్స్ వస్తాయని అభిమానులు ఆశించారు ముఖ్యంగా 'హ+ 2' సినిమా అప్‌డేట్ అర్ధరాత్రి రాకపోవడంతో ఫ్యాన్స్ తీవ్ర నిరాశకు గురయ్యారు.?సంగీత దర్శకుడు థమన్ గతంలో ఇచ్చిన హింట్స్ వల్ల పెద్ద ప్రకటన వస్తుందని ఆశించినా, కేవలం బర్త్‌డే పోస్టర్‌కే పరిమితం కావాల్సి వస్తుందని తెలుస్తోంది. సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఉన్న క్రేజ్‌ను దృష్టిలో ఉంచుకుని మేకర్స్ డేలోపు ఏదైనా సర్ప్రైజ్ ఇస్తారేమో చూడాలి.

## ది ప్యారడైజ్ : ఆ విషయంలో ఇంకా పట్టు బిగించాల్సిందే..!



నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంపై భారీ అంచనాలున్నాయి. సెప్టెంబర్ 24న విడుదల కానున్న ఈ సినిమాకు ఇప్పటికే మంచి బజ్ ఏర్పడింది.అయితే కేవలం ఆసక్తిని పెంచడమే కాకుండా, రాబోయే రోజుల్లో దూకుడుగా సాగే ప్రమోషన్లతో ఈ హైప్‌ను థియేట్రికల్ వేవ్‌గా మార్చాల్సిన అవసరం ఉంది.బాక్సాఫీస్ దగ్గర మ్యాజిక్ చేయాలంటే ఈ చిత్రం ఓ రేంజ్ లో ఎఫెక్ట్ చూపెట్టాలి. మరి నాని అండ్ టీమ్ ఈ విషయంలో రిలీజ్ కు ముందు ఎంత మేర హైప్ క్రియేట్ చేస్తారో చూడాలి.

## రెండు నగరాలు.. ఒకే జీవితం.. సూర్య- జ్యోతిక ముంబై- చెన్నై కనెక్షన్ అసలు కథ ఇదే!

చెన్నైతో ఉన్న అనుబంధాన్ని కంటిన్యూ చేస్తూనే ముంబైతోనూ స్ట్రాంగ్ కనెక్షన్‌ను కొనసాగిస్తున్న ఈ స్టార్ కపుల్ లైఫ్‌స్టైల్ ఇప్పుడు ఇంట్రెస్టింగ్ గా మారింది. సినిమా స్టార్ల జీవితం అంటే ఎప్పుడూ ఒకే నగరానికి పరిమితమై ఉండటం కష్టం. ముఖ్యంగా కెరీర్, కుటుంబం, పిల్లల చదువు, వ్యక్తిగత సంబంధాలు.. ఇలా ఒక్కో అవసరానికి ఒక్కో నగరం కీలకంగా మారుతుంది. ప్రస్తుతం హీరో సూర్య, నటి జ్యోతిక ఫ్యామిలీ విషయంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. చెన్నైతో ఉన్న అనుబంధాన్ని కంటిన్యూ చేస్తూనే ముంబైతోనూ స్ట్రాంగ్ కనెక్షన్‌ను కొనసాగిస్తున్న ఈ స్టార్ కపుల్ లైఫ్‌స్టైల్ ఇప్పుడు ఇంట్రెస్టింగ్ గా మారింది. మైత్రీ రవి సూర్య తాజాగా తన నివాసంపై నెలకొన్న సందేహాలకు క్లారిటీ ఇవ్వడంతో ఈ డిస్కషన్ మరోసారి తెరపైకి వచ్చింది. తాను చెన్నైలోనే ఉంటున్నానని, ముంబైకి మాత్రం తరచూ ప్రయాణిస్తున్నానని ఆయన చెప్పడం ద్వారా.. ముంబైకి వెళ్లడం అంటే చెన్నైని పూర్తిగా వదిలేయడం కాదనే విషయం స్పష్టమైంది. అయితే ఈ కుటుంబానికి ముంబై ఎందుకు అంత ముఖ్యమైంది? అన్నది చూస్తే, దాని వెనుక కేవలం సినిమా పనులు మాత్రమే లేవు. జ్యోతిక పుట్టి పెరిగింది ముంబైలోనే. ఆమె తల్లిదండ్రులకు దగ్గరగా ఉండాలనే ఫ్యామిలీ డెసిషన్ కూడా ముంబైతో వారి అనుబంధాన్ని పెంచింది. పిల్లల చదువు, ఫ్యామిలీతో ఎక్కువ సమయం గడపడం వంటి అంశాలు కూడా ఈ డెసిషన్ లో కీలకంగా మారినట్లు సూర్య గతంలో వెల్లడించారు. మరోవైపు చెన్నై మాత్రం సూర్యకు కేవలం ఒక నగరం కాదు.. అతని సినీ ప్రయాణానికి, ఫ్యామిలీ లైఫ్ కు ఎన్నో ఏళ్లుగా బేస్‌గా ఉన్న ప్రాంతం. అందుకే ముంబైలో ఫ్యామిలీకి స్పెషల్ స్పేస్ ఏర్పడినా, చెన్నైతో ఉన్న బంధాన్ని మాత్రం వదులుకోలేదు. గతంలో సూర్య ముంబైలోని తమ చిన్న ఇంటి గురించి మాట్లాడుతూ, అక్కడి ప్రశాంతమైన కుటుంబ వాతావరణాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇక్కడే రెండు నగరాలు– రెండు అవసరాలు అనే కాన్సెప్ట్ ఆసక్తికరంగా మారుతోంది. చెన్నై సూర్య కెరీర్‌కు బేస్ అయితే.. ముంబై ఫ్యామిలీ బాండింగ్స్, పిల్లల లైఫ్, జ్యోతిక పర్సనల్ వరల్డ్ కు దగ్గరైన నగరంగా మారింది. అంటే ఇది ఒక నగరాన్ని వదిలి మరో నగరాన్ని ఎంచుకున్న కథ కాదు. అవసరానికి తగ్గట్టుగా రెండు నగరాలను తమ జీవితంలో భాగం చేసుకున్న ఫ్యామిలీ స్టోరీ. అందుకే సూర్య– జ్యోతిక విషయంలో ఎక్కడ ఉంటున్నారు? అనే ప్రశ్న కంటే.. రెండు నగరాలను ఎలా బ్యాలెన్స్ చేస్తున్నారు? అనేదే అసలు ఆసక్తికరమైన అంశంగా మారింది.



Printed, Published & Owned by Madala Venkata Seshagiri, Printed at VSAR PUBLICATIONS Printing Press (Name & Address) Printer irk : DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 516002. and Published from 27/8/423, 3RD BIT NTR NAGAR, NEAR CPM PARTY OFFICE, SRI POTTI SRIRAMULU NELLORE, ANDHRA PRADESH - 524003. Editor, Mandala Venkata Seshagiri, RNI Regd. No : APTEL/2012/45871, Cell: 93980 90609, 8500008668 idhinijamNellore @gmail.com